



తిరుమల ఆలయం ముందు దేవతామూర్తుల సెట్టింగ్



పుష్ప పల్లకిలో తిరుచానూరు పద్మావతీ దేవి



తిరుమల ఆలయంలో ఫల,పుష్పాలంకరణలు



ఉగాది ఆస్థానానికి నూతన వస్త్రాలను తీసుకెళుతున్న జీయర్ స్వాములు



మల్లాం పురవీధుల్లో దేవతామూర్తుల ఊరేగింపు

వైభవంగా ఉగాది



చంద నాలంకారంలో చెంగాళమ్మ

క్రోధినామ సంవత్సర ఉగాది వేడుకలను మంగళవారం ఘనంగా జరుపుకున్నారు.పలు ఆలయాల్లో వైభవంగా ఉగాది ఆస్థానంతో పాటు పంచాంగ శ్రవణం జరిగాయి.తీపి బెల్లం, చేదు వేప పూతలతో కూడిన ఉగాది పచ్చడిని అందరికీ పంచిపెట్టారు.తిరుచానూరు ఆలయంలో మంగళవారం సాయంత్రం పుష్పపల్లకిలో మహాలక్ష్మీదేవి అలంకరణలో పద్మావతీదేవి కొలువై తిరుమాడ వీధుల్లో ఊరేగారు.రాత్రి ఆలయంలో పంచాంగ శ్రవణం నిర్వహించారు.తిరుపతిలోని గోవిందరాజ స్వామి, కోదండరామస్వామి ఆలయాల్లో ఉగాది ఆస్థానం నిర్వహించారు.టీటీడీ హిందూధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో తిరుపతిలోని మహతి కళాక్షేత్రంలో ఉగాది వేడుకలు నిర్వహించారు.సంస్కృత విశ్వవిద్యాలయ ఆచార్యులు వేదాంతం శ్రీవిష్ణుభట్టాచార్యులు పంచాంగశ్రవణం చేశారు. అనంతరం అష్టావధానం జరిగింది.చిట్టమూరు మండలంలోని మల్లాం వళ్లీ దేవసేన స్వయంభు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో దేవతల గ్రామోత్సవం జరిగింది.విఘ్నేశ్వర స్వామి, వళ్లీ దేవసేన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, కామాక్షిదేవి సమేత మార్కండేశ్వర స్వామి, దేశమ్మ, శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి, అయ్యప్ప , మహాలక్ష్మి , సీతారాములు, షిరిడీ సాయిబాబా ఉత్సవమూర్తులను ఊరేగించారు. సూళ్లూరుపేటలో చెంగాళమ్మ పరమేశ్వరి స్వర్ణకిరీట చందనాలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.ఆస్థాన మండపంలో లక్ష కుంకుమార్చన నిర్వహించారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఉదయం ఉగాది పచ్చడిని భక్తులకు ప్రసాదంగా పంపిణీ చేశారు.సాయంత్రం ఆస్థాన మండపంలో పంచాంగ శ్రవణం జరిగింది.భక్తులు తమ గ్రహగోచారాలను ఆసక్తిగా ఆలకించారు. అనంతరం పగడ చెట్టు వద్ద అవధానులు, కవులు, రచయితలు సాహిత్య గానం చేశారు. రాత్రి స్వామి అమ్మవార్ల ఊరేగింపు వైభవంగా జరిగింది.

- ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్

శ్రీవారి ఆలయంలో ఆకట్టుకున్న అలంకరణలు

తిరుమల, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) :వేంకటేశ్వరస్వామి కొలువైన తిరుమల క్షేత్రంలో ఉగాది ఆస్థానం సందర్భంగా ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామికి, విష్వక్సేనుల వారికి విశేష సమర్పణ జరిగింది. శ్రీవారి ఉత్సవర్లను బంగారు వాకిలిలో గరుడాళ్వార్‌కు అభిముఖంగా, మరోపీఠంపై విష్వక్సేనులవారినీ వేంచేపు చేశారు. అనంతరం పంచాంగ శ్రవణం జరిగింది. బంగారు వాకిలి వద్ద ఆగమ పండితులు, అర్చకులు శాస్త్రోక్తంగా ఉగాది ఆస్థానం నిర్వహించారు.టీటీడీ ఉద్యానవన విభాగ ఫల, పుష్పాలంకరణలు ఆకట్టుకున్నాయి. 10 టన్నుల సంప్రదాయ పుష్పాలు, 60 వేల కట్ ఫ్లవర్స్‌ను అలంకరణకు వినియోగించారు. ప్రత్యేకించి ఆలయంలో ఆపిల్, ద్రాక్ష, బత్తాయి, నారింజ, కర్బూజ, మామిడి వంటి విభిన్న రకాల పండ్ల గుత్తులు, ఉత్తమజాతి పుష్పాలతో భూలోక వైకుంఠంగా శ్రీవారి ఆలయాన్ని రూపొందించారు.ఆలయంలో ధ్వజస్తంభం వద్ద పుచ్చకాయలతో చెక్కిన దశావతారాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అలాగే అయోధ్య రామాలయం, బాలరాముడి సెట్టింగ్,నవధాన్యాలతో రూపొందించిన మత్స్య అవతారం భక్తులను ఆకట్టుకున్నాయి. ఆలయం వెలుపల గొల్లమండపం పక్కన త్రేతా, ద్వాపర, కలియుగాలకు సంబంధించిన శ్రీరాముడు, శ్రీకృష్ణుడు, వేంకటేశ్వరస్వామి,వేదనారాయణ స్వామి, మహావిష్ణువు దశావతరాలు, ఉద్యానవనంలో ఆడుకుంటున్న రామలక్ష్మణ సమేత హనుమంతులు, బాలకృష్ణుడు వంటి పౌరాణిక ఘట్టాలు విశేషంగా ఆకర్షించాయి. ఉద్యానవన విభాగ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 150 మంది పుష్పాలంకరణ కళాకారులు, టీటీడీ గార్డెన్ సిబ్బంది వంద మంది రెండురోజుల పాటు శ్రమించి ఆకర్షణీయమైన పుష్పాలంకరణ ఆకృతులను రూపొందించారు.



శ్రీకాళహస్తీశ్వరాలయంలో పంచాంగ శ్రవణం

శుభ కార్యాలకు కోడ్ కష్టాలు!

- బంగారం, వస్త్రాల కొనుగోళ్ళు తప్పనిసరి
- వెంట నగదు తీసుకెళుతుంటే తనిఖీల బెడద
- ఆన్‌లైన్ చెల్లింపులపై అవగాహన లేమి
- క్షేత్రస్థాయిలో అమలు కాని సడలింపులు

ఇది శుభ కార్యాల సీజను. పెళ్ళిళ్ళు, గృహ ప్రవేశాలు వంటి వాటికి ముహూర్తాలు అధికంగా వున్నాయి. దీంతో కళ్యాణ మండపాలు, ఫంక్షన్ హాళ్ళు కళకళలాడుతున్నాయి. అయితే శుభకార్యాలు తలపెట్టుకున్న వారికి సార్వత్రిక ఎన్నికలు చుక్కలు చూపిస్తున్నాయి. ఎన్నికల నేపథ్యంలో ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చింది. దానితో పాటే జిల్లావ్యాప్తంగా చెక్‌పోస్టులు వెలిశాయి. వాటితో పాటు ఎక్కడపడితే అక్కడ వాహనాల తనిఖీలు జరుగుతున్నాయి. బంగారం, వస్త్రాలు, ఫర్నిచర్ వంటి వాటి కొనుగోలుకు నగదు వెంట తీసుకెళుతుంటే తనిఖీలలో భాగంగా స్వాధీనం చేసుకుంటున్నారు. నగల కొనుగోలు సంగతేమో కానీ ఆ నగదు వెనక్కు తీసుకోవడానికి శుభకార్యాల నిర్వాహకుల తలప్రాణం తోకకొస్తోంది. ఇలాంటి వాటికి సడలింపులున్నాయని అధికారులు చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో అవేవీ అమలు కావడం లేదు. దీంతో ఎన్నికల సంగతి తెలియక బుద్ధి తక్కువై శుభకార్యాలు పెట్టుకున్నామంటూ బాధితులు వాపోతున్నారు.

తిరుపతి క్రైం, ఏప్రిల్ 9: జిల్లాలో శుభ ముహూర్తాలు వుండడంతో ఈ సీజనులో పెళ్ళిళ్ళు అధికంగా పెట్టుకుంటున్నారు. ఈ నెల 18, 19,20,21,24,26,27 తేదీల్లో వివాహాలకు శుభ ఘడియలు వున్నాయి. తిరుపతితో పాటు జిల్లా అంతటా పెద్దసంఖ్యలో పెళ్ళిళ్ళు వున్నాయి. ఈనెల 27 నుంచి మూడు నెలల వరకు శుభ కార్యాలకు మూఢం అడ్డు వస్తోంది. దీంతో ఆ లోపే గృహ ప్రవేశాలు, శంకుస్థాపనలు, చిన్నారులకు నామకరణం వంటి కార్యక్రమాలు కూడా ఎక్కువగా జరుగుతున్నాయి. ఇటీవలి కాలంలో శుభ కార్యాలకు కానుకలు ఇచ్చే అలవాటు బాగా పెరిగింది. ఇక పెళ్ళంటే మాటలు కాదు కదా? నగలు కొనుగోలు చేయాలి. కొత్త బట్టలు కొనాలి. కళ్యాణ మండపాలకు అడ్వాన్సులు చెల్లించాలి. మంగళ వాయిద్యాలు మొదలుకుని పౌరోహిత్యం, బ్యూటీషియన్, ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ, డెకరేషన్, క్యాటరింగ్.. ఇలా ఒకటా రెండా అన్నింటికీ ముందుగానే మాట్లాడుకుని అడ్వాన్సులు కట్టాలి. అమ్మాయిల తల్లిదండ్రుల్లో ఎక్కువమంది కొత్త ఫర్నిచర్ కూడా కొనుగోలు చేస్తుంటారు. ఇందులో ఒకటి రెండు మినహా మిగిలిన వాటికి రూ. లక్షల్లోనే చెల్లింపులు. దీంతో ఇంటి నుంచీ బయలు దేరితే జేబులో రూ.లక్షలు వుండాల్సిందే. సాధారణ రోజుల్లో నగదు వెంట తీసుకుని ప్రయాణించడం ఇబ్బందేమీ కాదు కానీ ఇపుడు సార్వత్రిక ఎన్నికలు జరుగుతున్నాయి. గత నెల 16న ఎన్నికల షెడ్యూలు వెలువడింది. అదే రోజు నుంచీ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. కనీసం ఐదు తులాల బంగారం కొనాలన్నా రూ. 3 లక్షల పైనే అవుతుంది. కొత్త బట్టలూ రూ.లక్షల్లోనే. చెక్‌పోస్టుల్లో, మార్గమధ్యంలో తనిఖీలు చేపడుతున్న పోలీసులు రూ. 50 వేలకు మించి నగదు దొరికితే సీజ్ చేస్తున్నారు. యక్ష ప్రశ్నలు వేస్తున్నారు. పోలీసు స్టేషన్‌కు పోవడంతో పాటు నగదుకు ఆధారాలు చూపి వెనక్కు తీసుకునేసరికి చుక్కలు కనిపిస్తున్నాయి.కొందరు ఆధునిక టెక్నాలజీ సాయంతో మొబైల్ నెట్ బ్యాంకింగ్ ద్వారా చెల్లింపులు జరుపుతున్నా ఎక్కువమంది నగదు చెల్లింపులే చేస్తున్నారు. శుభమా అని శుభకార్యాలు పెట్టుకుని కొనుగోళ్ళకు బయల్దేరితే తీరా పోలీసు స్టేషన్లకు చేరాల్సి వస్తోంది. ఇది వారిని తీవ్ర వేదనకు గురి చేస్తోంది.

నిబంధనల్లో స్పష్టత ఏదీ?

చట్ట ప్రకారం రూ. 50 వేలు మించి నగదు చెల్లింపులకు పాన్ కార్డు వుండాలి. తనిఖీల్లో రూ. 50 వేలకు మించి నగదు వుంటే లెక్కలు చెప్పాలని అధికారులు చెబుతున్నారు. మళ్ళీ అదే అధికారులు రూ. 10 లక్షలకు మించి పట్టుబడితే ఆదాయ పన్ను శాఖ అధికారులకు సమాచారం ఇచ్చి అప్పగిస్తామంటున్నారు. మరోవైపు రూ. 5 లక్షల వరకూ పర్వాలేదని, అది దాటితే లెక్కలు, ఆధారాలూ చూపాలని వారే చెబుతున్నారు. దీనిపై స్పష్టత లేకపోవడంతో పాటు క్షేత్రస్థాయిలో పోలీసులు రూ. 50 వేలు పైబడి నగదు దొరికితే చాలు స్టేషన్లకు తీసుకెళుతున్నారు. ఆ నగదు వాపస్ తీసుకోవడానికి బాధితులకు రోజులు పడుతోంది. పెళ్ళి పత్రిక చూపిస్తే వదిలేస్తామని అధికారులు చెబుతున్నా చాలావరకూ పెళ్ళి ముహూర్తానికి పదిహేను రోజుల ముందు మాత్రమే పత్రికలు ముద్రించే పరిస్థితి వుంది. కానీ నగలు, బట్టలు మాత్రం చాలా ముందుగానే కొనుగోలు చేస్తారు. దీంతో అందరూ పెళ్ళి పత్రికలు చేతపట్టుకుని నగదుతో ప్రయాణించాలంటే వీలు కాదు. నిజానికి ఎన్నికల్లో ఓటర్లకు నగదు పంపిణీ పోలింగ్‌కు ఒకటి రెండు రోజులు ముందు మాత్రమే జరగడం ఆనవాయితీ. నోటిఫికేషన్ వెలువడ్డాక కఠినంగా ఆంక్షలు అమలు చేసినా పర్వాలేదు కానీ షెడ్యూలు నుంచే సుమారు రెండు నెలల పాటు సామాన్య జనాన్ని, అవసరార్థం నగదుతో వెళుతున్న వారిని తనిఖీల పేరిట వేధించడం విమర్శలకు దారి తీస్తోంది. భారీ మొత్తాలు దొరికితే చట్ట ప్రకారం వ్యవహరించడం తప్పదు. కానీ రూ. 5 లక్షల లోపు స్వల్ప మొత్తాలకు నోటిఫికేషన్ కంటే ముందు నుంచీ ఆంక్షలు విధించడం సరికాదన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.





రైతులకు, సామాన్యులకు ఇబ్బంది లేదు

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో తనిఖీలు వున్నప్పటికీ రైతులు, సామాన్యుల విషయంలో ఎలాంటి ఇబ్బందులూ కలిగించడం లేదు. నగదుతో ప్రయాణించే వారు తగిన పత్రాలు వెంట వుంచుకోవాలి. ఉదాహరణకు బ్యాంకు నుంచీ నగదు డ్రా చేసిన రశీదులు, లేదా పాస్ బుక్ వుండాలి. రూ. 5 లక్షల వరకూ నగదు వున్నా సామాన్యులు, రైతుల విషయంలో ఇబ్బంది వుండదు. శుభ కార్యాలకు సంబంధించి కూడా ఇదే వర్తిస్తుంది. పెళ్ళి పత్రిక వంటి ఆధారాలు చూపితే చాలు. నగదుతో వెళుతున్న వ్యక్తి నేపథ్యం, స్థాయిని బట్టి విచక్షణతో వ్యవహరిస్తాం. హోల్ సేల్ వ్యాపారులు, వడ్డీ వ్యాపారులు, బంగారు నగర వర్తకులు వంటి వారిపై ఎక్కువగా దృష్టి పెడతాం. వారి వద్ద నగదు దొరికితే లెక్కలు పక్కాగా చూపాల్సిందే. రూ. 5 లక్షల లోపు అయితే జీఎస్టీ అధికారులకు అప్పగిస్తాం. అంతకు మించితే ఆదాయ పన్ను శాఖకు సమాచారమిస్తాం. ఏ స్థాయిలో నగదు పట్టుబడినా తగిన లెక్కలు, ఆధారాలు చూపితే సమస్య లేదు. ప్రత్యేకించి శుభ కార్యాల కోసం నగదుతో వెళ్ళే వారు కనీస ఆధారాలు చూపితే చాలు.

- సురేంద్రరెడ్డి, తిరుపతి డీఎస్పీ

తిరుపతి ఎంపీ అభ్యర్థిగా చింతా మోహన్

రెండో జాబితాతో అనుమానాలకు తెరదించిన కాంగ్రెస్ అధిష్ఠానం



తిరుపతి , ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : ఇండియా కూటమి పొత్తులో భాగంగా తిరుపతి అసెంబ్లీ సీటు సీపీఐకి వెళ్లడంతో ఎంపీ సీటు కూడా ఇతరులకు కేటాయిస్తారేమోనన్న అనుమానాలకు కాంగ్రెస్ అధిష్ఠానం తెరదించింది. మంగళవారం విడుదల చేసిన రెండోజాబితాలో తిరుపతి ఎంపీ అభ్యర్థిగా డాక్టర్ చింతా మోహన్‌కే అవకాశం కల్పించింది. తిరుపతి లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో పార్టీకి పెద్దదిక్కుగా ఉన్న చింతా మోహన్ రాష్ట్ర విభజన అనంతరం 2014, 2019 సాధారణ ఎన్నికల్లోనూ, 2021 ఉప ఎన్నికల్లోనూ కాంగ్రెస్ తరఫున ఎంపీగా పోటీ చేసి ఓటమి చెందారు. అయినా పార్టీనే అంటిపెట్టుకుని కాంగ్రెస్ జెండాను ఊరూ వాడా తిప్పారు. అయితే ఎంపీ సీటు తనకు వస్తుందని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు అంజయ్య ఇటీవల మీడియా ముందు ఇండియా కూటమి తరఫున స్వీయ ప్రకటన చేశారు. అసెంబ్లీ సీటుతో పాటు ఎంపీ సీటు కూడా ఇండియా కూటమికి వెళ్లే అవకాశాలున్నాయన్న వార్తల నేపథ్యంలో చింతా మోహన్ పదిరోజులుగా ఢిల్లీలో మకాం వేశారు.ఎట్టకేలకు ఏఐసీసీలో తనకున్న ప్రాబల్యాన్ని మరోసారి చాటుకున్నారు. ఆయన తిరుపతి ఎంపీగా ఉప ఎన్నికలతో కలిపి పదకొండోసారి పోటీ చేయబోతున్నారు.ఆరు సార్లు ఎంపీగా గెలిచి, ఒక పర్యాయం కేంద్ర మంత్రిగా కూడా పనిచేశారు.

వైసీపీ శ్రేణులకు పండుగ బహుమతి!

- ఒకటిన్నర సెంటు ఇంటి స్థలానికి ఎంజాయ్‌మెంటు పట్టా

రేణిగుంట, ఏప్రిల్ 9 : రేణిగుంట పట్టణంలో ఎంపిక చేసిన వైసీపీ కార్యకర్తలకు పండుగ బహుమతి పంపిణీ జరిగింది.ఉగాది, రంజాన్ పండుగలను పురస్కరించుకుని ముఖ్య ప్రజాప్రతినిధి కుమారుడు ఇంటి పట్టాలు పంపిణీ చేశారు. మంగళవారం మధ్యాహ్నం పట్టణంలో జరిగిన వైసీపీ కార్యకర్తల అత్యవసర సమావేశంలో రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే మధన్నను మళ్లీ గెలిపించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. అనంతరం మండల పరిధిలోని అడుసుపాళెంలో ప్రభుత్వ భూమికి సర్వే నెంబరు వేసి ఆ భూమిలో ఎనిమిది సంవత్సరాలుగా కాపురం ఉంటున్నట్లు, తహసీల్దారుకు అర్జీ పెట్టుకుంటే ఆ విషయాన్ని గుర్తించి 2016లో ఒకటిన్నర సెంటు పట్టా ఇచ్చినట్లు చూపుతున్న పత్రాలను వైసీపీ క్యాడర్‌కు పంపిణీ చేశారు. అయితే మధన్న ఎమ్మెల్యేగా ఈసారి గెలిచిన తరువాతే ఇంటి జాగాలు చూపిస్తామనడం కొసమెరుపు.దీంతో ఈ ఇంటి పట్టాలు అసలా, డూప్లికేటా అని తీసుకున్నవాళ్లు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (బుధవారం) :
సా. 6.28



నేను జిల్లా వాసినిని... ముప్పై ఏళ్ళుగా తిరుపతి నివాసినిని... నాపై దుష్ప్రచారం చేస్తున్న ప్రత్యర్థులదే పొరుగు జిల్లా... ఆధ్యాతిక నగరమైన తిరుపతికి కడప సంస్కృతిని తెచ్చింది వారే!... అంటూ కుండ బద్దలు కొట్టారు తిరుపతి అసెంబ్లీ జనసేన-టీడీపీ-బీజేపీ ఉమ్మడి అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు. ప్రపంచ ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన తిరుపతి నుంచీ అసెంబ్లీకి పోటీ చేస్తుండడం గర్వంగా భావిస్తున్నానని చెబుతున్న ఆయన ప్రజలు అవకాశమిస్తే తిరుపతి రూపురేఖలు మారుస్తానంటున్నారు. ఎన్నికల ప్రచారంలో తాను తీసుకోబోతున్న నినాదం, ఎంచుకోనున్న ప్రచారాంశాలతో పాటు జనం ఆశీర్వదిస్తే తిరుపతిలో చేపట్టబోయే అభివృద్ధి పనుల గురించిన తన ఆలోచనలను ఆంధ్రజ్యోతితో పంచుకున్నారాయన. అవన్నీ ఆయన మాటల్లోనే.... - తిరుపతి, ఆంధ్రజ్యోతి

నేను జిల్లా వాసి.... ముప్పై ఏళ్ళుగా తిరుపతి నివాసి!

నేను నాన్ లోకల్ అనడం అర్థరహితం

నేను చిత్తూరు జిల్లా వాసిని. తిరుపతి కూడా మొన్నటి దాకా అందులో భాగమే. ముప్పై ఏళ్ళుగా తిరుపతిలో నాకు సొంత ఇల్లుంది. తిరుపతిలో అడుగడుగునా బంధువులున్నారు. స్నేహితులైతే విపరీతంగా వున్నారు. ఎందరో బంధుమిత్రులు ఇక్కడ స్థిరపడ్డారు. తెలియని వారంటూ ఎవరూ లేరు. ఒక తిరుపతే కాదు జిల్లావ్యాప్తంగా ప్రతి పల్లె, ప్రతి మనిషీ నాకు తెలుసు. 40 ఏళ్ళుగా కాంట్రాక్టరుగా జిల్లా అంతటా ప్రభుత్వ నిధులతో అభివృద్ధి పనులు చేశా. తిరుపతికి నేను నాన్ లోకల్ అనడం అర్థరహితం.

నాపై దుష్ప్రచారం చేస్తున్న ప్రత్యర్థులది పొరుగు జిల్లా

కడప సంస్కృతిని, రాజారెడ్డి పాలనను తిరుపతికి తెచ్చింది వారే!

అవకాశమిస్తే తిరునగరి రూపురేఖలు మారుస్తా!

జనసేన-టీడీపీ-బీజేపీ ఉమ్మడి అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు

నా ప్రత్యర్థులే స్థానికేతరులు.. కడప సంస్కృతిని తెచ్చింది వారే!

తిరుపతిలో నన్ను నాన్ లోకల్‌గా దుష్ప్రచారం చేస్తున్న ప్రత్యర్థులే నిజానికి స్థానికేతరులు. నేను నాన్ లోకల్ అంటూ ఫ్లెక్సీలు, బ్యానర్లు పెట్టించిన వైసీపీ ఎమ్మెల్యే ఆత్మవిమర్శ చేసుకోవాలి. వారిది కడప జిల్లా. అక్కడి నుంచీ వచ్చి రాజకీయాలు చేస్తున్నారు. ఆధ్యాత్మిక నగరమైన తిరుపతికి కడప సంస్కృతిని తెచ్చింది వారే. వైఎస్ రాజారెడ్డి రాజ్యాంగాన్ని, పాలనను తిరుపతిలో స్థాపించింది వారే. అసలు తిరుపతిలో ఇదివరకూ పోటీ చేసిన వారంతా బయటి జిల్లాలకు చెందిన వారే. నెల్లూరు, కడప, కోస్తాంధ్ర జిల్లాలకు చెందిన వారు తిరుపతిలో పోటీ చేశారు. శ్రీవారి సన్నిధైన తిరుపతిని అభివృద్ధి పరచడంలో అందరి భాగస్వామ్యం వుంది. తిరుపతిపై అందరికీ హక్కుంది.

మూడు పార్టీలకు జిల్లా అధ్యక్షుడిగా పనిచేశా!

జిల్లా రాజకీయాల్లో నా అంత అనుభవం ఎవరికీ లేదు. ప్రజారాజ్యం, తెలుగుదేశం, వైఎస్సార్ కాంగ్రెస్... ఇలా మూడు ప్రధాన రాజకీయ పార్టీలకు జిల్లా అధ్యక్షుడిగా సమర్థవంతంగా పనిచేశా.అపారమైన అనుభవం, విస్తృతమైన పరిచయాలున్నాయి. చిత్తూరు కంటే కూడా తిరుపతిలోనే ఎక్కువ రాజకీయానుభవం వుంది.

తిరుపతిలో కూలీగా పనిచేశా... నగరాన్ని ఎలా అభివృద్ధి చేయాలో తెలుసు

ఇదే తిరుపతిలో 40 ఏళ్ళ కిందట కూలీగా పనిచేశా. కష్టపడి జేఎంసీ కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ స్థాపించా. కాంట్రాక్టరుగా ఎదిగా. తిరుపతిలో టీటీడీ, మున్సిపాలిటీ, పబ్లిక్ హెల్త్, ఆర్ అండ్ బీ తదితర శాఖల నిధులతో అసంఖ్యాక అభివృద్ధి పనులు చేపట్టా. ప్రతి వీధిలోనూ పనులు చేశా. నగరంపై సంపూర్ణ అవగాహన వుంది. ఎలా అభివృద్ధి చేయాలో తెలుసు. జనసేనాని పవన్ కళ్యాణ్‌కు తిరుపతి పట్ల ప్రత్యేక ప్రేమ, ఆసక్తి వున్నాయి. టీడీపీ అధినేత చంద్రబాబు స్వస్థలం ఇది. ఆయన పెరిగింది, చదువుకుంది ఇక్కడే. వారి సహాయ సహకారాలతో తిరుపతి రూపురేఖలు మార్చి అద్భుతంగా తీర్చిదిద్దుతా. ప్రత్యేకించి రోజూ శ్రీవారి దర్శనానికై వచ్చే లక్షలాదిమంది భక్తులకు అన్ని రకాల సదుపాయాలు, వసతులు కల్పించడంపై దృష్టి పెడతా.

కూటమి పార్టీల నుంచీ సంపూర్ణ మద్దతు వుంది!

తిరుపతిలో జనసేన, తెలుగుదేశం, భారతీయ జనతా పార్టీల నుంచీ నాకు సంపూర్ణ మద్దతు వుంది. ఇన్నేళ్ళు పార్టీలో కష్టపడి పనిచేసిన నేతలకు టికెట్ రాకుంటే అసంతృప్తి, ఆవేదన కలగడం సహజం. అయితే విస్తృత ప్రయోజనాల కోసం అధిష్ఠానాలు ఒక నిర్ణయం తీసుకున్నప్పుడు దాన్ని ఆయా పార్టీల నాయకులు పాటించాల్సిందే. వారి కష్టానికి అధిష్ఠానాలు తగిన న్యాయం చేస్తాయి. టీడీపీ నేతలను అధినేత చంద్రబాబు ఇటీవల శ్రీకాళహస్తికి పిలిపించి చర్చించారు. దీంతో వారి అసంతృప్తి తొలగిపోయింది. తిరుపతిలో మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు వందశాతం నా విజయానికి సహకరిస్తున్నారు. మాజీ ఎమ్మెల్యే సోదరి సుగుణమ్మ మద్దతివ్వడంతో పాటు ముందుండి పార్టీ శ్రేణులను కదిలిస్తున్నారు. ఒకరిద్దరు అసంతృప్తితో వుండచ్చు. అవి కూడా సర్దుకుంటాయి. నిస్సందేహంగా మూడు పార్టీల నేతలూ ఉమ్మడి ప్రణాళికతో కలసికట్టుగా పనిచేసి తిరుపతిలో భారీ ఆధిక్యతతో గెలుస్తున్నాం.


ఎస్వీయూ స్టేడియంలో మంగళవారం సరదాగా క్రికెట్ ఆడుతున్న ఆరణి

వైసీపీ నేతల అవినీతే ఎన్నికల నినాదం!

తిరుపతి వైసీపీ నేతల అవినీతే నా ఎన్నికల నినాదం. గత ఐదేళ్ళలో అధికార పార్టీ నేతలు ప్రభుత్వ భూముల కబ్జాలకు పాల్పడ్డారు. ప్రైవేటు వ్యక్తుల భూములనూ కాజేశారు. అభివృద్ధి పనుల్లోనూ కమీషన్ల పేరిట భారీగా నిధులు బొక్కేశారు. టీటీడీ నిధులనూ దుర్వినియోగం చేశారు. రోడ్ల నిర్మాణం, విస్తరణల పేరిట కనీవినీ ఎరుగని నిధుల దోపిడీ జరిగింది.టీడీఆర్ బాండ్లను ఎమ్మెల్యే సొంత ప్రయోజనాల కోసం దారి మళ్ళించి రూ. 3 వేల కోట్ల దుర్వినియోగానికి పాల్పడ్డారు. రోడ్ల పనుల్లో స్థలాలు, ఇళ్ళు, షాపులు పోగొట్టుకున్న వారిలో చాలా మందికి బాండ్లు అందలేదు. వారికి న్యాయం జరగలేదు. వీటినే ఎన్నికల్లో ప్రచారాంశాలుగా మలచుకుంటున్నాం. గత ఐదేళ్ళలో వైసీపీ నేతలు చేసిన తప్పులను ప్రజల్లోకి తీసుకెళ్ళి తిరుపతిలో దౌర్జన్యకర సంస్కృతికి చరమగీతం పాడుతాం.

అధికార పార్టీ నేతల అక్రమార్జన కక్కిస్తాం!

రాజధాని అమరావతి, విశాఖ, విజయవాడలతో పాటు రాష్ట్రంలో తిరుపతికి కూడా అంతే ప్రాధాన్యత వుంది. ప్రశాంతతకు, ఆధ్యాత్మికతకు పేరుపడిన తిరుపతిని అధికార పార్టీ నేతలు తమ అవినీతి, రౌడీయిజం, దౌర్జన్యాలతో అప్రతిష్ఠపాలు చేస్తున్నారు. టీడీఆర్ బాండ్ల పేరిట భారీ ఎత్తున నిధుల దుర్వినియోగం జరిగిన విషయాన్ని ఎన్నికల కమిషన్‌తో పాటు ప్రభుత్వానికి కూడా ఫిర్యాదు చేశాం. ఆలస్యంగా నిద్ర మేల్కొన్న ప్రభుత్వం హడావిడిగా బాండ్లు చెల్లవని ప్రకటించింది. అంటే తిరుపతిలో టీడీఆర్ బాండ్ల పేరిట అవినీతి జరిగిందని ప్రభుత్వం అంగీకరించినట్టే. ఎన్నికల్లో కూటమి పార్టీలు అధికారంలోకి రావడం ఖాయం. ఈ వ్యవహారంలోనే కాదు మొత్తంగా వైసీపీ నేతల అక్రమార్జన అంతా తిరిగి కక్కిస్తాం!

నూతన సంవత్సరంలో సరికొత్త ప్రభుత్వం

- ఎన్డీఏ నేతలదే గెలుపు
- ఉగాది వేడుకల్లో జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు


కుటుంబ సభ్యులతో కలసి ఉగాది వేడుకల్లో పాల్గొన్న ఆరణి శ్రీనివాసులు

తిరుపతి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): తెలుగు నూతన సంవత్సరాది ఉగాదిలో సరికొత్త ప్రభుత్వం కొలువుతీరనుందని ఎన్డీఏ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు అన్నారు. మంగళవారం జనసేన కార్యాలయంలో జరిగిన ఉగాది వేడుకల్లో కుటుంబ సమేతంగా ఆరణి పాల్గొన్నారు. పంచాగ శ్రవణం విన్నారు. కూటమి నేతలతోపాటు స్నేహితులు, అభిమానులు ఆరణికి పెద్దఎత్తున ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలుగు కొత్త సంవత్సరాదిలో నియోజకవర్గ ప్రజలందరికీ మంచి జరుగుతుందని ఆకాంక్షించారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ బలపరుస్తున్న జనసేన గెలవడం ఖాయమని స్పష్టంచేశారు. వైసీపీ పాలనలో తిరుపతి ప్రతిష్ఠ మంటగలిసిపోయిందన్నారు. ఆధ్యాత్మిక నగరం కాస్త అసాంఘిక కార్యకలాపాలకి అడ్డాగా మారిందని ఆరోపించారు. వచ్చే తెలుగు నూతన సంవత్సరంనాటికి తిరుపతిని ప్రశాంత నగరంగా మారుస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆర్సీ మునికృష్ణ, కోడూరు బాలసుబ్రమణ్యం, చినబాబు, మహేష్ యాదవ్, కంకణాల రజినీకాంత్, ఆర్సీ శ్రీనివాస్, బీజేపీ నాయకులు అజయ్ కుమార్, జనసేన నాయకులు రాజారెడ్డి, ఆకేపాటి సుభాషిణి, కీర్తన పాల్గొన్నారు. దీనికి ముందు ఉదయం ఎన్టీఆర్ స్టేడియంలో వాకింగ్ చేస్తూ ప్రచారం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే మోహన్, టీడీపీ నాయకులు బుల్లెట్ రమణ, ఇనుకొండ సుబ్రమణ్యం, సింగంశెట్టి సుబ్బరామయ్య, ప్రేమ్ కుమార్, కోటేశ్వరరావు, విశ్వనాథ, రాజారామ్, ఆనంద్ గౌడ్, పెరుమాళ్ మధు, బీజేపీ నేత వరప్రసాద్, జనసేన నేతలు ఆర్కాట్ కృష్ణ ప్రసాద్, రమేష్ బాబు పాల్గొన్నారు.


వాకర్లతో ఆరణి శ్రీనివాసులు

ఓటేరు చెరువులో చేపల చిచ్చు పోలీసు స్టేషన్‌కు చేరిన వివాదం

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 9: తిరుపతి రూరల్ మండలం ఓటేరు చెరువులో చేపల చిచ్చు భగ్గుమంది. చివరకు పోలీసులు రాజీ కుదిర్చినట్లు తెలిసింది. గ్రామస్తుల కథనం ప్రకారం వివరాలిలా.. ఓటేరు సర్పంచ్ లక్ష్మి భర్త రాజా స్థానిక చెరువులో చేపలు పట్టే పనిని ఇటీవల నెల్లూరుకు చెందిన ఒక వ్యక్తికి అప్పగించాడు. సర్పంచ్ సూచన మేరకు ఆ వ్యక్తి మంగళవారం వచ్చి చేపలు పడుతుండగా మూకుమ్మడిగా గ్రామస్తులు వెళ్లి అడ్డుకున్నారు. దీంతో వివాదం చెలరేగింది. తర్వాత ఈ తగాదా ఎంఆర్ పల్లి పోలీసు స్టేషన్‌కు చేరింది. తాము చెరువులో చేపలు వదలితే, తమను కాదని బయట వ్యక్తులకు చేపలు పట్టమని చెప్పడం సరికాదంటూ సర్పంచ్ భర్తను నిలదీశారు. అప్పటికే పట్టిన చేపలను రెండు వ్యాన్లలో నెల్లూరు తరలించాడని వీరు ఆరోపిస్తున్నారు. ఈ విషయంలో సర్పంచ్ భర్త, గ్రామస్తుల మధ్య పోలీసులు రాజీ కుదిర్చినట్లు సమాచారం. దీనిపై ఎంఆర్‌పల్లి సీఐ అహ్మద్‌ను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా వివాదం స్టేషన్‌కు వచ్చిన మాట వాస్తవమే.. కానీ ఇరు పార్టీలు కూర్చుని రాజీ చేసుకోవడంతో కేసు నమోదు చేయలేదన్నారు.

ఆర్వో ప్లాంట్ ప్రారంభం



చంద్రగిరి, ఏప్రిల్ 9: ప్రజలకు సేవ చేయాలనే సంకల్పం గొప్పదని టీడీపీ నాయకురాలు పులివర్తి సుధారెడ్డి అన్నారు. ఐతేపల్లె పంచాయతీ నూలి వెంకన్న కొత్తపల్లిలోని ముత్యాలమ్మ ఆలయానికి చంద్రగిరికి చెందిన పిచ్చి విశాలక్షి, జనార్దన రెడ్డి దంపతులు ఆర్వో ప్లాంట్ వితరణ చేశారు. మంగళవారం జరిగిన ఈ ప్లాంట్ ప్రారంభోత్సవానికి హాజరైన సుధారెడి మాట్లాడుతూ దీర్ఘకాలిక ప్రయోజనాలందించే సేవా కార్యక్రమాలు చేపట్టడం సంతోషకరమన్నారు.టీడీపీ నాయకుడు, పారిశ్రామిక వేత్త ఏవీ రమణమూర్తి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రామాపురంలో టీడీపీ ఇంటింటి ప్రచారం

రామచంద్రాపురం, ఏప్రిల్ 9: అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా టీడీపీ అభ్యర్థి పులివర్తి నానిని గెలిపించాలంటూ ఆ పార్టీ నాయకులు మంగళవారం రామాపురంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు.పులివర్తి వినీల్, నరసింహారెడ్డి, ధనంజయరెడ్డి, కుమార్, రవి, మునిరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈతకు వెళ్లి యువకుడి మృతి


జయంత్ శర్మ మృతదేహం

చంద్రగిరి, ఏప్రిల్ 9: బావిలో ఈతకు వెళ్లి ఓ యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. పోలీసుల కథనం ప్రకారం.... చంద్రగిరి పాతపేట బజారువీధి, కావమ్మగుడివీధి సమీపంలో ఉంటున్న సుభాషిణి కుమారుడు జయంత్ శర్మ(24) ఓ ప్రయివేటు స్కూల్లో పనిచేస్తున్నాడు. ఇతని తండ్రి కామేశ్వర్ శర్మ ఈ ఏడాది ఫిబ్రవరిలో అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో జయంతే తల్లిని పోషించేవాడు. ఈక్రమంలో మంగళవారం మధ్యాహ్నం జయంత్ ఐదుగురు స్నేహితులతో కలసి ఈతకు వెళ్ళాడు. చంద్రగిరి సమీపంలోని దోసుళ్ళ వంక వద్ద వ్యవసాయ బావిలో ఈతకు దిగారు. ఈత సరిగా రాని జయంత్ బావిలో మునిగిపోయాడు. స్నేహితులు గాలించి బయటకు తీసి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు.

కనువిందుగా ఉగాది వేడుకలు

తిరుచానూరు, ఏప్రిల్ 9: తిరుచానూరులో మంగళవారం ఉగాది వేడుకలు వైభవంగా నిర్వహించారు. సుప్రభాత సేవతో పద్మావతి అమ్మవారిని అర్చకులు మేల్కొపి నిత్య కైంకర్యాలు నిర్వహించారు. మధ్యాహ్నం ఉత్సవర్లకు సుగంధ పరిమళ ద్రవ్యాలతో వేదమంత్రోచ్ఛరణల మధ్య స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం పుష్పపల్లకీపై శ్రీమహాలక్ష్మీదేవి అలంకరణలో అమ్మవారు తిరుమాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు కటాక్షించారు. రాత్రి పంచాంగ పఠనం నిర్వహించారు. డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏఈవో రమేష్, సూపరింటెండెంట్ మధు, శేషగిరి, కేపీ చంద్రశేఖర్, అర్చకుడు బాబుస్వామి టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, సుభాస్కర్‌నాయుడు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతవర్సిటీలో ఉగాది సంబరాలు

తిరుపతిరూరల్, ఏప్రిల్ 9: తిరుపతిలోని జాతీయ సంస్కృతవర్సిటీలో ఉగాది పర్వదినాన్ని మంగళవారం వేడుకగా నిర్వహించారు. పూజ, హోమ కార్యక్రమంలో అధ్యాపకులతో కలసి వీసీ ప్రొఫెసర్ జీఎస్ఆర్ కృష్ణమూర్తి పాల్గొన్నారు. చెలికాని అన్నారావు సభా భవనంలో సీవోఈ డాక్టర్ సాంబశివమూర్తి నేతృత్వంలో పంచాంగ పఠనం జరిగింది.

- తుమ్మలగుంట కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉగాది ఆస్థానాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి దంపతులు స్వామివారికి పట్టువస్త్రాలను సమర్పించారు. పూజలు, పంచాగ పఠనం నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటివద్ద ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఊరూవాడా ఉగాది సంబరాలు


కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో పంచాంగపఠనం

చంద్రగిరి, ఏప్రిల్ 9: చంద్రగిరి మండలంలో మంగళవారం ఉగాది పండగను ఘనంగా జరుపుకొన్నారు. శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఉగాది ఆస్థానం నిర్వహించారు. సోపాన మండపంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీహరిలతో సహా విష్వక్సేనుడి ఉత్సవర్లను కొలువు దీర్చి ఆలయ అర్చకులు బాలాజీరంగాచార్యులు పంచాంగ పఠనం చేశారు.డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపీనాథ్, సూపరింటెండెంట్లు వెంకటస్వామి, మునిచెంగల్రాయులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్, ఆలయ అర్చకులు శేషాద్రిచార్యులు, పార్థసారథి, నారాయణాచార్యులు పాల్గొన్నారు. ● చంద్రగిరిలోని మూలస్థాన ఎల్లమ్మ ఆలయంలో అమ్మవారికి అభిషేకం చేశారు. సాయంత్రం పంచాగ పఠనం నిర్వహించారు. చైర్మన్ యారాశి చంద్రశేఖర్‌రెడ్డి, ఈవో రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.వాసవీకన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారికి అభిషేకం నిర్వహించారు. కార్యక్రమాలకు దాతలుగా చేగు ఫ్యామిలీ, చేగు బృందం వ్యవహరించారు. తొండవాడ అగస్త్యేశ్వరాలయంలో స్వామివారికి అభిషేకం నిర్వహించారు.

ఈ ఏడాదంతా శుభం కలగాలి : నాని


పూజలు చేస్తున్న పులివర్తి నాని

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 9: క్రోధినామ సంవత్సరంలో ప్రజలకు శుభం జరగాలని చంద్రగిరి నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని ఆకాంక్షించారు. తిరుపతి రూరల్ మండలంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో నాని పాల్గొని ఉగాది పచ్చడి స్వీకరించారు. నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని దేవుడ్ని ప్రార్థించారు.

శాస్త్రోక్తంగా మహాలక్ష్మి హోమం


మహాలక్ష్మి హోమం నిర్వహిస్తున్న దృశ్యం

రామచంద్రాపురం, ఏప్రిల్ 9 : ఉగాది సందర్భంగా రాయలచెరువుకట్ట భవానీ జలకంఠేశ్వరస్వామి ఆలయం వద్ద మంగళవారం శాస్త్రోక్తంగా మహాగణపతి, మహాలక్ష్మి హోమం నిర్వహించారు. స్వామి అమ్మవార్లకు తిరుమంజనం నిర్వహించి ప్రత్యేక అలంకరణలు చేపట్టారు. ఉదయం వేదమంత్రోచ్చారణల మధ్య మహాలక్ష్మి హోమం ప్రారంభించి పూర్ణాహుతితో ముగించారు.ఉభయదాత కాకర్ల కావ్య, వేణుగోపాల్‌నాయుడు దంపతులు పాల్గొన్నారు.

గాయపడిన ఉద్యోగి మృతి


రవి(ఫైల్‌ఫొటో)

చంద్రగిరి, ఏప్రిల్ 9: చంద్రగిరి జాతీయ రహదారిలో జరిగిన ప్రమాదంలో గాయడిపన రవి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు కార్వేటినగరానికి చెందిన రవి(40) టీటీడీలో కాంట్రాక్ట్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. సొంత పనుల నిమిత్తం ఈనెల 5న బైక్‌పై చిత్తూరు వెళ్లాడు.తిరిగి తిరుపతికి వస్తుండగా చంద్రగిరి ఫ్లైఓవర్ సమీపంలో బైక్ అదుపు తప్పి ప్రహారీ గోడను ఢీకొంది. రవికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తిరుపతి రుయాస్పత్రికి తరలించారు. తర్వాత చెన్నైలోని రాజీవ్‌గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు.

వాకర్స్ సమస్యలపై ఆరణి ఆరా

తిరుపతి, (విశ్వవిద్యాలయం) 9: తిరుపతి ఎస్వీ యూనివర్శిటీ స్టేడియంలో మంగళవారం ఉదయం వాకర్స్‌ను తిరుపతి టీడీపీ, బీజేపీ,. జనసేన ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు కలిశారు.ఉగాది శుభాకాంక్షలు తెలిపి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.మైదానంలో క్రీడాకారులతో సరదాగా కొద్ది సేపు ముచ్చటించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాసేపు సరదాగా క్రికెట్ ఆడారు.తరువాత తనను గెలిపించాలని అభ్యర్థించారు.

ఎంపీడీవో కార్యాలయానికి చేరిన 57వీల్‌చైర్లు

తిరుపతిరూరల్, ఏప్రిల్9: తిరుపతి రూరల్ మండల పరిధిలోని దివ్యాంగ ఓటర్ల సౌకర్యం కోసం 57 వీల్‌చైర్లు మంగళవారం ఎంపీడీవో కార్యాలయానికి చేరుకున్నాయి. పోలింగ్ కేంద్రాల వద్ద దివ్యాంగ ఓటర్లకు ఈ చైర్లను వినియోగించనున్నారు. ఈవోపీఆర్డీ గిరిధర్‌రెడ్డి చైర్లను పరిశీలించి భద్రపరిచారు.


వీల్‌చైర్లను పరిశీలిస్తున్న ఈవోపీఆర్డీ గిరిధర్‌రెడ్డి

వైసీపీ నుంచి జనసేనలో చేరిక



మంగళం, ఏప్రిల్ 9: తిరుపతి రూరల్ మండలం సప్తగిరి పంచాయతీలో వార్డు మెంబరు తనూజ, ఆమె భర్త బాబుయాదవ్, అనుచరులు వైసీపీని వీడి జనసేనలో చేరారు. వీరికి జనసేన చంద్రగిరి ఇన్‌చార్జి దేవర మనోహర్ జనసేన కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. తిరుపతి అర్బన్ అధ్యక్షుడు కిషోర్‌రాయల్, రూరల్ అధ్యక్షుడు పగడాల యువరాజురాయల్, చంద్రగిరి మండలాధ్యక్షుడు తపసి మురళీరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జీడీనెల్లూరు బరిలో డిప్యూటీ సీఎం మేనల్లుడు

చిత్తూరు రూరల్, ఏప్రిల్ 9: కాంగ్రెస్ పార్టీ పూతలపట్టు, గంగాధరనెల్లూరు నియోజకవర్గాల అభ్యర్థులను మంగళవారం రాత్రి ప్రకటించింది. మలివిడత జాబితాలో పూతలపట్టుకు ప్రస్తుత ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, గంగాధరనెల్లూరు అభ్యర్థిగా రమేష్ బాబుకు అవకాశం ఇచ్చారు. డిప్యూటీ సీఎం నారాయణస్వామి మేనల్లుడు అయిన రమేష్ బాబుకు గంగాధరనెల్లూరు టికెట్‌ను కాంగ్రెస్ పార్టీ కేటాయించింది. వైసీపీ అభ్యర్థిగా నారాయణ స్వామి కుమార్తె కృపాలక్ష్మికి టికెట్ కేటాయించిన విషయం తెలిసిందే. గత పది సంవత్సరాలుగా నారాయణస్వామికి అనధికార వ్యక్తిగత కార్యదర్శిగా రమేష్ బాబు కొనసాగుతూ వచ్చారు. దీంతో నియోజకవర్గంలో రమేష్ బాబుకు స్థానిక నాయకులతో సత్సంబంధాలు ఉన్నాయి. ఇటీవల నారాయణస్వామిని వ్యతిరేకించిన రమేష్ బాబు షర్మిల సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు.గంగాధరనెల్లూరు టికెటును రమేష్ బాబుకు కాంగ్రెస్ కేటాయించడం వైసీపీకి పెద్ద దెబ్బ అనే చెప్పాలి.పూతలపట్టు నియోజకవర్గంలో కూడా దళితవాడల్లో ఎంఎస్ బాబుకు వున్న పట్టు కారణంగా వైసీపీ ఓట్లు చీలే అవకాశం ఎక్కువగా ఉంది.

తిరుపతి

తిరుమలలో సందర్శనీయ ప్రాంతాలు కళకళ



జపాలి ఆంజనేయస్వామి ఆలయం వద్ద భక్తుల సందడి

తిరుమల, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): తెలుగు నూతన సంవత్సరాది ఉగాది సందర్భంగా తిరుమలలోని సందర్శనీయ ప్రాంతా లు మంగళవారం కళకళలాడాయి. శ్రీవారి దర్శనార్థం వచ్చిన యాత్రికులతోపాటు తిరుపతి, తిరుమల స్థానికులు పాపవినాశనం, ఆకాశగంగ, జపాలి, వేణుగోపాలస్వామి ఆలయం, శ్రీవారిపాదాలు, చక్రతీర్థం, శిలాతోరణం వద్ద కిక్కిరిసి కనిపించారు. మంగళవారం కావడంతో జపాలి ఆంజనేయస్వామి ఆలయం వద్ద భక్తుల రద్దీ నెలకొంది. గోగర్భం డ్యాం వద్దనున్న క్షేత్రపాలకుడు(రుద్రుడు), పాచికాల్వ గంగమ్మ ఆలయం, స్థానికులు నివాసముండే బాలాజీనగర్‌లోని వినాయకస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

ఉపాధ్యాయుల సేవా కేంద్రం ప్రారంభం



తిరుపతి(విద్య), ఏప్రిల్ 9: ఏపీ ఉపాధ్యాయ సంఘ (ఆపస్) ఆధ్వర్యంలో తిరుపతిలోని న్యూ ఇందిరానగర్‌లో ఏర్పాటు చేసిన ఉపాధ్యాయుల సేవా కేంద్రాన్ని మంగళవారం రాష్ట్ర అధ్యక్షుడు శవన్నగారి బాలాజి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో టీచర్ల సర్వీసు, ప్రభుత్వ విద్యారంగానికి సంబంధించిన సమస్యల పరిష్కారానికి ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని, చెప్పారు. వివరాలకు జిల్లా ప్రధానకార్యదర్శి జి.సాంబిరెడ్డి (91603 22382), సహాధ్యక్షుడు డాక్టర్ దేవరాజులు (94926 52759), ఉపాధ్యక్షులు దాము(91823 21491), మురళిమోహన్(81427 66765)లను సంప్రదించాలని కోరారు. అలాగే ఈ నూతన కార్యాలయంలో ఉగాది సంబరాలను నిర్వహించి, పంచాంగశ్రవణం చేశారు. జిల్లా గౌరవాధ్యక్షుడు ప్రసాద్‌రాజు, రాష్ట్ర కార్యదర్శి సుభాష్‌చంద్రదాస్, వసంతకుమార్, విజయసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ జేఈవో బాధ్యతల స్వీకారం



గౌతమి

తిరుమల, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): టీటీడీ హెల్త్, ఎడ్యుకేషన్ జేఈవోగా ఎం.గౌతమి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో జేఈవోగా పనిచేసిన సదా భార్గవి బదిలీ అయిన క్రమంలో ఆ స్థానంలో గౌతమిని నియమిస్తూ సోమవారం రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. మంగళవారం సాయంత్రం తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలో ఆమె బాధ్యతలు స్వీకరించారు.

పది రోజులకే కంకర తేలిన రోడ్డు



తిరుపతి (మధురానగర్), ఏప్రిల్ 9: మధురానగర్‌లో నిర్మించిన సెవెల్ హిల్స్ స్కూల్ రోడ్డు పది రోజులకే కంకర తేలింది. ఇంత నాసిరకంగా రోడ్డు వేస్తారా? అంటూ కాంట్రాక్టర్ తీరుపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



తెలుగు మహిళ నాయకురాలు బ్యాంకు శాంతమ్మను ఉగాది సందర్భంగా మంగళవారం పలువురు సత్కరించారు. ఈ కార్యక్రమంలో 38, 9 వార్డుల అధ్యక్షులు రేవతి, స్రవంతిలతోపాటు జాహ్నవి, మల్లిక, లక్ష్మి, నీలావతి, శాంతమ్మ కల్పన పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.55 కోట్లు

తిరుమల, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.55 కోట్లు లభించింది. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ సోమవారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. ఈమేరకు ఆదాయం లభించినట్టు మంగళవారం ఉదయం ప్రకటించింది. ఇక, సోమవారం 61,920 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 17,638 మంది తలనీలాలు సమర్పించారు.

నేడు 'భువన విజయం'

తిరుపతి(కల్చరల్), ఏప్రిల్ 9: సంగీత, నృత్య కళాశాల ఆవరణలో బుధవారం ఉదయం 10 గంటలకు భువనవిజయం సాహితీ రూపకం ప్రదర్శన ఉంటుంది. అలనాడు ఆంధ్రభోజుడు శ్రీకృష్ణదేవరాయల ఆస్థానంలోని పండితుల సాహితీ వైదుష్యాన్ని ఈనాటి సాహితీ ప్రియులకు అందించడానికి సంగీత, నృత్య కళాశాల, విశ్వశ్రీ సాహితీ సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఉమ ముద్దుబాల సంచాలకులుగా వ్యవహరిస్తారు.

మద్యం విక్రయాలపై ఈసీ నిఘా పెంచాలి

తెలుగు యువత



మీడియాతో మాట్లాడుతున్న రవినాయుడు

తిరుపతి అర్బన్, ఏప్రిల్ 9: రాష్ట్రంలో మద్యం విక్రయాలపై ఎన్నికల కమిషన్ (ఈసీ) నిఘా పెంచాలని తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవినాయుడు కోరారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ.. 2019 ఉగాది పర్వదినాన సంపూర్ణ మద్యపాన నిషేధం చేస్తామన్న చెప్పిన జగన్.. చివరకు రాష్ట్రాన్ని మద్యాంధ్రప్రదేశ్‌గా మార్చేశారని ధ్వజమెత్తారు. గతంలో ఉన్న బ్రాండ్స్ రద్దుచేసి.. కొత్తపేర్లతో మరిన్ని ప్రవేశపెట్టి విచ్చలవిడిగా విక్రయిస్తున్నారన్నారు. దీనిపై మహిళలు నిలదీయాలని పిలుపునిచ్చారు. మరోవైపు నాణ్యత లేని మద్యం విక్రయిస్తుండడంతో ఎంతో మంది ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఎన్నికల్లో మద్యం ద్వారా గెలవాలని చూస్తున్నారని, ఈ క్రమంలోనే రాష్ట్రవ్యాప్తంగా 3,500 దుకాణాల్లో 15వేల మంది సొంత పార్టీ కార్యకర్తలను అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో నియమించారని ఆరోపించారు. ప్రతి దుకాణంలో టోకెన్ విధానంతో వైసీపీ కార్యకర్తల కనుసన్నల్లో అనధికారంగా మద్యం బాటిల్స్ అందజేస్తూ.. ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తున్నారని ఆగ్రహించారు. అందువల్ల మద్యం విక్రయాలను ఈసీ పరిధిలోకి తేవాలని విన్నవించారు. అలాగే డిజిటల్ పేమెంట్ సిస్టం తీసుకొచ్చి, డిస్టలరీస్‌పై నిఘా పెట్టాలన్నారు. ఇప్పటివరకు జరిగిన విక్రయించిన మద్యంపై శ్వేతపత్రం విడుదల చేయాలని, ఆడిటింగ్ జరపాలని డిమాండ్ చేశారు. నాయకులు కృష్ణయాదవ్, కర్లం సంతీప్, శ్రీనివాస్‌యాదవ్, శ్రీనివాసులు, తోటవాసు తదితరులు పాల్గొన్నారు.

'మద్యంతో గెలవాలని చూస్తున్న వైసీపీ'

తిరుపతి అర్బన్, ఏప్రిల్ 9: ఎన్నికల్లో మద్యం ద్వారా గెలవాలని వైసీపీ చూస్తోందని లిబరేషన్ కాంగ్రెస్, వీసీకే (విడుదలై చిరుతగల్ కక్షి) పార్టీల రాష్ట్రాధ్యక్షులు విజయకుమార్(విశ్రాంత ఐఏఎస్), విద్యాసాగర్ ఆరోపించారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో వారు మీడియాతో మాట్లాడుతూ.. మద్యం విక్రయాల్లో డిజిటల్ విధానం అమలు చేయాలని, పోలింగ్ వరకు మద్యాన్ని నిషేధించేలా ఈసీ చర్యలు చేపట్టాలని కోరారు. కుటుంబ పార్టీలను ఓడించడమే తమ నినాదమని చెప్పారు. ప్రస్తుతానికి మూడు ఎంపీ, 12 ఎమ్మెల్యే స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేశామన్నారు.

ఉగాది వేడుకలు



మహతిలో జరిగిన ఉగాది వేడుకల్లో పాల్గొన్న ప్రముఖులకు సత్కారం

తిరుపతి (కల్చరల్), ఏప్రిల్ 9: క్రోధి నామ ఉగాది వేడుకలను టీటీడీ హిందూధర్మప్రచార పరిషత్, సంక్షేమవిభాగం సంయుక్తంగా మంగళవారం నిర్వహించాయి. మహతి వేదికగా ఉదయం 9.30 గంటలకు శ్రీవేంకటేశ్వర సంగీత నృత్యకళాశాల విద్యార్థుల మంగళవాయిద్య గోష్టితో సంబరాలు మొదలయ్యాయి. సంస్కృత విశ్వవిద్యాలయం ఆచార్యుడు వేదాంతం విష్ణుభట్టాచార్యులు పంచాంగశ్రవణం చేశారు. ఉన్నత వేదాధ్యయన సంస్థకు చెందిన వేదపండితులు వేదస్వస్తి నిర్వహించారు. శతావధాని ఆముదాల మురళి అవధానం జరిగింది. విశ్రాంతాచార్యులు గార్లపాటి దామోదర నాయుడు సంచాలకులుగా వ్యవహరించారు. టీటీడీ ధార్మిక ప్రాజెక్టుల ప్రత్యేకాధికారి రాజగోపాల్ అధ్యక్షత వహించారు. జి.గోవిందయ్య(నిషిద్ధాక్షరి), డాక్టర్ మన్నవ గంగాధరప్రసాద్ (సమస్య), యువశ్రీ మురళి (దత్తపది), డాక్టర్ నెమిలేటి కిట్టన్న (న్యస్థాక్షరి), డాక్టర్ నాదెళ్ల శ్రీమన్నారాయణ (వర్ణన) పేరూరు బాలసుబ్రమణ్యం (ఆశువు), డాక్టర్ పరమేశ్వరయ్య (పురాణపఠనం), డాక్టర్ పురుషోత్తమాచారి (అప్రస్తుత ప్రసంగం) పృచ్ఛకులుగా పాల్గొన్నారు. తర్వాత టీటీడీ ఉద్యోగుల పిల్లలు.. తెలుగువైతాళికులు అనే విచిత్రవేషధారణ, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. వేడుకల్లో టీటీడీ సంక్షేమ విభాగం డిప్యూటీ ఈవో స్నేహలత, ఏఈవో శ్రీరాములు, డిల్లీబాబు, కోకిల, గాలి గుణశేఖర్, బీఎన్ రెడ్డి, వెంకటేశ్వరరావు, పలువురు సాహితీప్రియులు, ఉద్యోగులు పాల్గొన్నారు. కాగా, టీటీడీకి చెందిన గోవిందరాజ స్వామి, కోదండరామస్వామి ఆలయాల్లోనూ ఉగాది నేపథ్యంలో పూజలు, ఆస్థానం నిర్వహించారు.

కలెక్టరేట్‌లో..



మాట్లాడుతున్న డీఆర్వో పెంచల కిషోర్

తిరుపతి(కలెక్టరేట్): పర్యాటక శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో ఉగాది వేడుకలను మంగళవారం నిర్వహించారు. ఎస్వీ వేద విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య రాణి సదాశివమూర్తి, డీన్ వెంకటసుబ్రహ్మణ్యం పంచాంగ శ్రవణం చేశారు. ఈ సందర్భంగా డీఆర్వో పెంచలకిషోర్ మాట్లాడుతూ.. మన మూలాలను ఎప్పటికి మరవకూడదన్నారు. అధికారులు రమణ ప్రసాద్, రూపేంద్రనాథ్‌రెడ్డి, భాస్కర్‌నాయుడు, రామకృష్ణారెడ్డి, బాలకొండయ్య తదితరులు పాల్గొన్నారు.

జీవలింగేశ్వరస్వామి ఆలయంలో..

తిరుపతి (జీవకోన): జీవకోనలోని పార్వతీ సమేత జీవలింగేశ్వరస్వామికి ప్రత్యేకపూజలు చేశారు. పంచాంగ శ్రవణం చేసి, భక్తులకు ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. ఆలయ ఛైర్మన్ సురేంద్రనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వినాయక సాగర్ వద్ద..

వినాయకసాగర్ వద్ద ఉన్న సంకల్పవరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పండితుడు సురేష్‌స్వామి, ధర్మకర్త చెంగారెడ్డి, సభ్యులు గుండాల గోపీనాథరెడ్డి, తొండమనాటి సుబ్రహ్మణ్యంరెడ్డి, డీపీ ఆనంద్, తిరుమలయ్య, రాజశేఖర్, రాజు, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

శాకాంబరిదేవిగా గంగమ్మ



తిరుపతి (కల్చరల్), ఏప్రిల్ 9: తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో ఉగాది సందర్భంగా మంగళవారం అమ్మవారికి ప్రత్యేక అలంకారం చేశారు. బంగారు ముఖబింబంతోపాటు వజ్రకిరీటం అమర్చి.. కూరగాయలతో శాకాంబరి దేవి అలంకారం చేశారు. రాత్రి 9.30 గంటల వరకు భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ ఈవో కె.మమత, అర్చకులు పాల్గొన్నారు.





పల్లకి ఉత్సవంలో భక్తుల సందడి - గరుడవాహనంపై స్వామివారు

గరుడ వాహనంపై కోదండరాముడు



తిరుపతి(కల్చరల్), ఏప్రిల్ 9: కోదండరామస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం ఎనిమిది గంటలకు స్వామివారి పల్లకీసేవ జరిగింది. ఉదయం 10 నుంచి 11.30 వరకు సీతా లక్ష్మణ సమేత శ్రీరాముల వారికి స్నపన తిరుమంజనం నేత్రపర్వంగా చేశారు. రాత్రి ఏడు నుంచి 8.30 గంటల వరకు గరుడవాహనంపై కోదండరాముడు మాడవీధుల్లో విహరించారు. అంతకు ముందు మధ్యాహ్నం మూడు నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఉగాది ఆస్థానం నిర్వహించారు. తిరుమల పెద్ద జీయంగారు, ఆలయ డిప్యూటీ ఈవో నాగరత్న, ఏఈవో పార్థసారథి, సూపరింటెండెంట్ సోమశేఖర్, ప్రధాన అర్చకుడు ఏపీ ఆనందకుమార్ దీక్షితులు, భక్తులు పాల్గొన్నారు. ఉత్సవాల్లో భాగంగా ఆలయ ప్రాంగణంలోనూ, రామచంద్ర పుష్కరిణి వేదిక వద్ద నిర్వహించిన సంగీత కార్యక్రమాలు భక్తులను అలరించాయి. కాగా, బుధవారం ఉదయం ఎనిమిది నుంచి 9.30 గంటల వరకు హనుమంత వాహనం, రాత్రి ఏడు నుంచి 8.30 గంటల వరకు గజవాహనసేవ జరగనుంది.

రంజాన్ వేడుకలకు విస్తృత ఏర్పాట్లు



మీడియాతో మాట్లాడుతున్న షఫీ అహ్మద్ ఖాదరి

తిరుపతి అర్బన్, ఏప్రిల్ 9: రంజాన్ వేడుకలకు ఈద్గా మైదానంలో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు ముస్లిం మత పెద్ద షఫీ అహ్మద్ ఖాదరి తెలిపారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ.. గురువారం ఉదయం 9.30గంటలకు రంజాన్ ప్రార్థనలు ప్రారంభమవుతాయని చెప్పారు. షేక్ ఖాదర్‌బాషా, మాలిక్, చాన్‌బాషా, షేక్ అహ్మద్, అబ్దుల్‌గఫూర్, తదితరులు పాల్గొన్నారు.

ముంబైలోని శ్రీవారి ఆలయానికి కానుకగా వెండి పద్మపీఠం



తిరుమల, ఏప్రిల్9(ఆంధ్రజ్యోతి): ముంబైలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయానికి మంగళవారం వెండి పద్మపీఠం కానుకగా అందింది. ఉగాది సందర్భంగా ముంబైకి చెందిన శ్రీలక్ష్మీ నారాయణ రూ.4.38 లక్షల (4.65 కిలోల)తో పద్మపీఠాన్ని తయారు చేయించారు. ఈ పీఠాన్ని మంగళవారం ముంబై ఆలయ సూపరిటెండెంట్ రమేష్‌కు అందజేశారు.

తిరుమలేశుడి సేవలో ప్రముఖులు



సంతానం

తిరుమల, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని మంగళవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వీరిలో.. తమిళ సినీ నటుడు సంతానం, ఎమ్మెల్సీలు భరత్, సిపాయి సుబ్రహ్మణ్యం ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు.



టీడీపీ సీనియర్ నాయకుడు మబ్బు దేవనారాయణ రెడ్డి పుట్టిన రోజు వేడుకలు రాయల్ నగర్‌లోని ఆయన నివాసంలో జరిగాయి. జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులతో పాటు టీడీపీ నాయకులు ఆర్సీ మునికృష్ణ, కోడూరు బాలసుబ్రహ్మణ్యం, మహేష్ యాదవ్ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

అన్నదానం

తిరుపతి అర్బన్, ఏప్రిల్ 9: ప్రసూతి హాస్పిటల్ ఆవరణంలో లయన్స్‌క్లబ్ ఆఫ్ గరుడాద్రి ఆధ్వర్యంలో మంగళవారం అన్నదానం చేశారు. తిరుపతి అధ్యక్షుడు మక్కిన భాస్కర్, కార్యదర్శి శంకరయ్య, కోశాధికారి చక్రపాణి, సోమయ్య, వామాద్రినాయుడు, నవీన్, జయలక్ష్మి, మురళి, మధుసూదన్, రామారావు, సుజాత, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సకలదేవతామూర్తుల గ్రామోత్సవం



దేవతల వేషధారణలో నృత్య ప్రదర్శన చేస్తున్న కళారులు

చిట్టమూరు, ఏప్రిల్ 9: మండలంలోని మల్లాంలో వెలసిన శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో సకల దేవతల ఉత్సవ మూర్తుల గ్రామోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. ఆలయ కమిటీ చైర్మన్ చిల్లకూరు సాయికుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉగాది పర్వదినం సందర్భంగా ఆలయంలో ఉన్న తొమ్మిదిమంది దేవతా ఉత్సవమూర్తులను ప్రత్యేక పుష్పాలతో ఆలయ ప్రధాన అర్చకులు భానుప్రకాష్ శర్మ అలంకరించారు. విఘ్నేశ్వర స్వామి, శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, కామాక్షీ దేవి సమేత మార్కండేశ్వరస్వామి, గ్రామశక్తి దేశమ్మ, శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి, అయ్యప్ప స్వామి, మహాలక్ష్మి, సీతారాములు, సాయిబాబా ఉత్సవ మూర్తులను గ్రామోత్సవంలో ఊరేగించారు. ఈ సందర్భంగా మహంకాళి, దేవతల వేషధారణలో భక్తుల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది.

కనులపండువగా సాయిబాబా పుష్పయాగం



సాయిబాబా పుష్పయాగంలో భక్తులు

నాయుడుపేట, ఏప్రిల్ 9: నాయుడుపేట పట్టణం అగ్రహారపేటలోని షిరిడీ సాయిబాబాకు కనులపండువగా పుష్పయాగం చేశారు. మంగళవారం క్రోధినామ ఉగాది సందర్భంగా షిరిడీ సాయిబాబా ఆలయ కమిటీ సభ్యులు 37 రకాలైన 1000 కిలోల పుష్పాలు, జాజి, పత్రి, సుగంధ ద్రవ్యాలతో పుష్పాభిషేకం చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో పుష్పాభిషేకంలో పాల్గొన్నారు. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు ఉగాది పచ్చడితోపాటు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు దాసరి ప్రభాకర్ నాయుడు, కార్యదర్శి చింతపూడి శ్రీధర్‌కుమార్, కోశాధికారి పూనాటి తిరుమలనాయుడు, ఉపాధ్యక్షుడు ముత్యాల్‌రెడ్డి, రమేష్, సిద్ధార్థ, ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన వైసీపీ శ్రేణులు



టీడీపీలో చేరిన వారితో కురుగొండ్ల రామకృష్ణ, లక్ష్మీసాయిప్రియ

డక్కిలి, ఏప్రిల్ 9: డక్కిలి మండలంలోని తీర్థంపాడు గ్రామానికి చెందిన 30 వైసీపీ కుటుంబాల వారు మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, టీడీపీ అభ్యర్థి కురుగొండ్ల లక్ష్మీసాయిప్రియ సమక్షంలో మంగళవారం టీడీపీలో చేరారు. అలాగే దగ్గవోలు గ్రామానికి చెందిన పలువురు మాజీ ఎమ్మెల్యేని కలిసి టీడీపీలో చేరే విషయమై చర్చించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి, మాజీ జడ్పీటీసీ ఏలేశ్వరం రామచంద్రయ్య నాయుడు, చెలికం బాస్కరరెడ్డి, టీడీపీ ప్రధాన కార్యదర్శి కుమార్ యాదవ్, హరినాద్ నాయుడు తదితరులు వున్నారు.

టీటీడీ జేఈవో బాధ్యతల స్వీకారం



తిరుమల, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): టీటీడీ హెల్త్, ఎడ్యుకేషన్ జేఈవోగా ఎం.గౌతమి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో జేఈవోగా పనిచేసిన సదా భార్గవి బదిలీ అయిన క్రమంలో ఆ స్థానంలో గౌతమిని నియమిస్తూ సోమవారం రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే.మంగళవారం సాయంత్రం తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలో ఆమె బాధ్యతలు స్వీకరించారు.

ఆలయాల్లో క్రోధి నామ సంవత్సర వేడుకలు



ముక్కంటి ఆలయం వద్ద ఉగాది శుభాకాంక్షలతో స్వాగత తోరణాలు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 9: శ్రీకాళహస్తీశ్వరాలయంలో మంగళవారం ఉగాది వేడుకలు జరిగాయి. తెలుగు సంవత్సరాదిని పురస్కరించుకుని ఆలయాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ప్రవేశ గోపురాల వద్ద పూలతో ఉగాది శుభాకాంక్షలు తెలిపేలా ఏర్పాటుచేసిన ఆర్చిలు ఆకట్టుకున్నాయి. ఆలయంలో పల విద్యుత్తు పూల అలంకరణలు దర్శనమిచ్చాయి.

ఉదయం ఉగాది పచ్చడిని ఈవో నాగేశ్వరరావు, ఆలయ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు భక్తులకు ప్రసాదంగా పంపిణీ చేశారు. అనంతరం స్వామి అమ్మవార్ల ఉత్సవ మూర్తులకు సంకల్ప పూజలు నిర్వహించారు. ఆ తర్వాత ముక్కంటి ఆలయం నుంచి తేరి వీధిలో వెలసిన భక్తకన్నప్ప స్వామికి పట్టు వస్త్రాలను ఊరేగింపుగా తీసుకువెళ్లి సమర్పించారు. సాయంత్రం ఆలయంలోని ఆస్థాన మండపంలో పంచాంగ శ్రవణం జరిగింది. అనంతరం పొగడ చెట్టు వద్ద అవధానులు, కవులు, రచయితలు సాహిత్య గానం చేశారు. సాహితీవేత్తలను ఈవో నాగేశ్వరరావు ఘనంగా సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం రాత్రి స్వామి అమ్మవార్ల ఉత్సవ మూర్తుల ఊరేగింపు జరిగింది. చతుర్మాడా వీధుల్లో భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకుని హారతులు సమర్పించి ముక్కులు తీర్చుకున్నారు. తెలుగు నూతన సంవత్సరం పురస్కరించుకుని మంగళవారం సుమారు 25 వేల మంది భక్తులు ముక్కంటి ఆలయాన్ని దర్శించుకున్నారు.





స్వామివారికి అభిషేకం చేస్తున్న అర్చకులు - భక్తకన్నప్పకు పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న అధికారులు



స్వామి అమ్మవార్ల ఉత్సవ మూర్తుల ఊరేగింపు

పిచ్చాటూరు: ఉగాది పండుగను పురస్కరించుకుని మంగళవారం మండలంలోని పలుదేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. రామగిరి శ్రీవాలీశ్వర స్వామి దేవాలయం, సుబ్రహ్మణ్యస్వామి దేవాలయం, అంకాళ పరమేశ్వరి దేవాలయం, కీళపూడి జలకంఠేశ్వరాలయం, సాయిబాబా ఆలయం, రాజానగరం కోదండ రామస్వామి ఆలయం, పిచ్చాటూరు వెంకటేశ్వర పెరుమాళ్ ఆలయాలు భక్తులతో సందడిగా మారాయి. పలువురు వేద పండితులు ఆలయం ఎదుట పంచాంగ పఠనం చేసి భక్తులకు ఉగాది పచ్చడి అందించారు. రామగిరికి పరిసర ప్రాంతాల భక్తులే కాక తమిళనాడులోని చెన్నై, బెంగళూరు నుంచి పెద్ద సంఖ్యలో హాజరై స్వామిని దర్శించుకున్నారు.

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో ఉగాది వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని ప్రసన్న వేంకటేశ్వరస్వామి, పచ్చాలమ్మ, కోందండ రామలయం చెంగాళమ్మ దేవాలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెలుగు సంవత్సరాది సందర్భంగా పిండి వంటలు చేసి పోలేరమ్మకు పూజలు చేశారు.



పల్లమాల గ్రామంలో ప్రత్యేక అలంకరణలో పచ్చాలమ్మ దేవత



బీఎన్‌కండ్రిగలో పోలేరమ్మకు పొంగళ్లు పెడుతున్న మహిళలు









బంగారుచీరలో మహాలక్ష్మమ్మ - వెంకటగిరి గాజుల అలంకరణలో కాత్యాయనీదేవి - ముత్యాలచీరలో ముత్యాలమ్మ - మత్స్యావతారంలో మద్వేంకటరామ్మూరి

వైభవంగా ఉగాది వేడుకలు

గూడూరు, ఏప్రిల్ 9: తెలుగు నూతన సంవత్సరాది ఉగాది పండుగను మంగళవారం ప్రజలు వేడుకగా జరుపుకున్నారు. పట్టణంలోని అమ్మవార్ల ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిపారు. స్థానిక బొడ్డుచౌక సెంటర్‌లోని మహాలక్ష్మమ్మ ఆలయంలో అమ్మవారిని బంగారుచీరతో అలంకరించి పూజలు జరిపారు. గంగమ్మ ఆలయంలో అమ్మవారిని వెండిచీరతో అలంకరించి పూజలు చేశారు. రాజరాజేశ్వరీదేవి ఆలయంలో అమ్మవారికి పూజలు చేసి అన్నదానం చేశారు. రెండో పట్టణ పరిధిలోని డీవీఆర్‌పల్లిలోని మహాలక్ష్మమ్మ ఆలయంలో నిర్వహించిన పూజా కార్యక్రమాలలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పాశిం సునీల్‌కుమార్, తిరుపతి బీజేపీ ఎంపీ అభ్యర్థి వరప్రసాదరావు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. మాళవ్యానగర్‌లోని శ్రీరామరక్షా కుటీరంలో ఉగాది పూజలు నిర్వహించి, గోపాలకృష్ణ గురుగుహ ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం జరిపారు. స్థానిక సాయిసత్సంగ నిలయంలో నిర్వాహకుడు కోట సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో విజయదుర్గాదేవికి పూజలు నిర్వహించి, నవావరణ హోమం జరిపారు. మధుసూదన్‌చే పంచాగ శ్రవణం జరిపారు. పోలేరమ్మ రచ్చల వద్ద భక్తులు అంబళ్లుపోసి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే స్థానిక డీఎస్‌ఆర్ కమ్యూనిటీ హాలులోని పొన్నలూరు వీరరాఘవరెడ్డి సంగీత, నృత్య పాఠశాలలో ఉగాది సందర్భంగా నృత్య ఉపాధ్యాయురాలు మల్లికా, విద్యార్థినులు నటరాజస్వామికి పూజలు నిర్వహించారు.

సూళ్లూరుపేట: పట్టణంలోని చెంగాళమ్మ పరమేశ్వరి స్వర్ణకిరీట చందనాలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. గోపూజ అనంతరం అమ్మవారి ఆస్థాన మండపంలో లక్షకుంకుమార్చన నిర్వహించారు. ఉభయకర్తలుగా ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, మాగుంట పార్వతమ్మ, పుష్పాలంకరణ ఉభయకర్తలుగా నెల్లూరు ఆర్ 900 షోరూం యజమానులు, చందనాలంకరణ ఉభయకర్తలుగా నెల్లూరు ఎంవీఐ చెన్నూరి రాంబాబు, సత్యకుమారి దంపతులు, పూజ ద్రవ్యాల విరాళదాతలుగా చిట్టేటి పెరుమాల్, గోవిందమ్మ దంపతులు, అన్నదాన ఉభయకర్తలుగా దేవారెడ్డి మునికృష్ణారెడ్డి, రాజేశ్వరి దంపతులు వ్యవహరించారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి అమ్మవారిని దర్శించుకొన్నారు. ముందుగా సహాయ కమిషనర్ దబ్బుగుంట వెంకటేశ్వర్లు జ్యోతిని వెలిగించి ఉగాది వేడుకలను ప్రారంభించారు. అదేవిధంగా పట్టణంలోని మద్వేంకటరామ్మూరి స్వామి ఆలయంలో స్వామివారికి పుష్పాలంకరణ చేశారు. బ్రాహ్మణ వీధిలో ఉన్న సీతారాముల దేవస్థానంలో వసంత నవరాత్రుల ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. తొలిరోజు స్వామివారు మత్స్యావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ ఉత్సవాలు శ్రీరామనవమి వరకు జరుగుతాయని ఆలయ కమిటీ చైర్మన్ కారంశెట్టి మల్లికార్జున శర్మ తెలిపారు.

సిద్ధం సభకు ముక్కంటి ఆలయ ఉద్యోగి



యాత్రలో పాల్గొన్న ముక్కంటి ఆలయ ఉద్యోగి

తొట్టంబేడు, ఏప్రిల్ 9: ఈ నెల 4వ తేదీన జగనన్న బస్సుయాత్రలో ముక్కంటి ఆలయ అన్నదానంలో పనిచేస్తున్న ఏంపేడు గ్రామం ఈశ్వరయ్య కాలనీకి చెందిన మోడుబోయిన రాజ పాల్గొన్నారు. అతను పాల్గొన్న ఫొటోలు సామాజిక మాధ్యమాలలో వైరల్ అయ్యాయి. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా బస్సు యాత్రకు హాజరైన ఆలయ ఉద్యోగిపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఆలయాల వద్ద కోలాట ప్రదర్శనలు



పిచ్చాటూరు, ఏప్రిల్ 9: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని పిచ్చాటూరుకు చెందిన ద్రౌపదీ అమ్మవారి ఆలయం వద్ద భజన బృందం చిన్నారులు కోలాటం నిర్వహించారు. సాయంత్రం 5 గంటలకు పిచ్చాటూరులోని మలయపెరుమాళ్ ఆలయం వద్ద, రాత్రి 7 గంటలకు కీళపూడి వీరాంజనేయస్వామి ఆలయం వద్ద చిన్నారుల కోలాటం ప్రదర్శన అందరిని ఆకట్టుకుంది. ఏర్పాట్లను గురువులు లోకేష్, శివకుమార్, తులసి, శ్రీవాణి, మణికంఠలు పర్యవేక్షించారు.

టీడీపీతోనే సంక్షేమం, అభివృద్ధి



గొల్లపల్లిలో టీడీపీ నాయకుల ప్రచారం

పుత్తూరు అర్బన్, ఏప్రిల్ 9: టీడీపీతోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు, క్లస్టర్ ఇన్‌చార్జి గంజి మాధవయ్య అన్నారు. మంగళవారం మండల పరిధిలోని గొల్లపల్లి దళితవాడలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవరత్నాల పేరుతో వైసీపీ ప్రతి ఒక్కరినీ దగా చేసిందని దుయ్యబట్టారు. టీడీపీ హయాంలో జరిగిన అభివృద్ధి పనులే తప్ప వైసీపీ ఐదేళ్లలో చేసింది శూన్యమని ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోసారి వైసీపీ మాయమాటలు నమ్మి మోసపోవద్దని హితవు పలికారు. ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదగాలనే సంకల్పంతో చంద్రబాబునాయుడు ఆరు గ్యారెంటీలను ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. రానున్న ఎన్నికల్లో నగరి ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్‌ను, ఎంపీ అభ్యర్థి దగ్గమళ్ల ప్రసాద్‌రావును గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా దళితవాడకు చెందిన నాగూరు, మురళి, మునెయ్య, చక్రపాణి, వెంకటముని, కస్తూరమ్మ, రోశమ్మ, తిరుపాలమ్మ, రాణెమ్మ తదితరులు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరికి గంజి మాధవయ్య పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు రవికుమార్, ప్రధాన కార్యదర్శి బాలాజీ, తడుకు సర్పంచ్ బొబ్బిలియాదవ్, మాజీ ఎంపీటీసీ కోట గజపతి, బూత్ ఇన్‌చార్జి విజయభాస్కర్‌రెడ్డి చిన్నబ్బ, మునికృష్ణయ్య, మునిరామయ్య పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

కృష్ణాభగవానుడికి పాలాభిషేకం



శ్రీకృష్ణ భగవానుడికి పూజలు నిర్వహిస్తున్న గీతాసేవా సమాజ సేవకులు

పుత్తూరు టౌన్, ఏప్రిల్ 9: పట్టణంలోని కామాక్షీదేవి సమేత సదాశివేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం ఉగాది సందర్భంగా శ్రీకృష్ణ భగవానుడికి పాలాభిషేకం నిర్వహించారు. ఉదయం స్వామివారికి నిత్య పూజా కైంకార్యలు చేపట్టారు. కలశ పూజలు, ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులు కృష్ణ భగవానుడికి పాలాభిషేకం నిర్వహించారు. అలాగే గీతాసేవా సమాజం ఆధ్వర్యంలో ద్రౌపదిదేవి అమ్మవారికి పసుపు, కుంకుమతో పాటు పట్టువస్త్రాలు అందజేశారు. కార్యక్రమంలో గీతాసేవా సమాజ గౌరవాధ్యక్షుడు పేట బాలకృష్ణారెడ్డి, సేవకులు, భక్తులు పాల్గొన్నారు.

వైసీపీ ప్రభుత్వం పట్ల అందరికీ విముఖతే: భానుప్రకాష్

వడమాలపేట, ఏప్రిల్ 9: ఐదేళ్ల వైసీపీ పాలనలో ఇబ్బందులు ఎదుర్కొన్న సామాన్య ప్రజలతో పాటు వైసీపీ నాయకులు సైతం విముఖతతో టీడీపీకి మద్దతు పలుకుతున్నారని నగరి ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్ అన్నారు. మంగళవారం తిరుపతిలోని ఆయన స్వగృహం వద్ద వడమాలపేట మండలానికి చెందని పలువురు వైసీపీ నాయకులు టీడీపీలో చేరారు. వారికి భానుప్రకాష్ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో మంత్రిగా రోజా అరాచకాలు, దౌర్జన్యాలతో ఇబ్బందులు పడ్డ వైసీపీ నాయకులు స్వచ్ఛందంగా టీడీపీలో వస్తున్నారన్నారు. వడమాలపేట మాజీ వైస్‌ఎంపీపీ నాగరాజు, ఎస్వీ పురానికి చెందిన వెంకటసుబ్బయ్య, తులసీరామ్, మునికృష్ణ, చెంగయ్య,దాము, సుబ్రహ్మణ్యం, కల్లూరుకు చెందిన వేణుగోపాలరెడ్డి, దాము, మహేష్, సుబ్బయ్య టీడీపీలో చేరిన వారిలో ఉన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సుబ్రహ్మణ్యం యాదవ్, దామయాదవ్, అంజయ్య, రఘురామయ్య, బాబు తదితరులు పాల్గొన్నారు.



టీడీపీలో చేరిన వారితో భానుప్రకాష్

కల్యాణ వెంకన్న ఆలయంలో ఉగాది ఆస్థానం





పెద్ద శేషవాహనంపై శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకన్న - అప్పలాయగుంటలో ఉగాది ఆస్థానం

నారాయణవనం, ఏప్రిల్ 9: తెలుగు నూతన సంవత్సరాది ఉగాది సందర్భంగా మంగళవారం నారాయణవనంలోని కల్యాణ వెంకన్న ఆలయంలో ఉగాది ఆస్థానం నిర్వహించారు. ఉదయం స్వామి, అమ్మవార్లకు ఉదయం నిత్య కైంకర్యాలు నిర్వహించి, ప్రత్యేక అభిషేకాలు చేశారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత స్వామివారిని నూతన పట్టువస్త్రాలు, పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి పెద్ద శేష వాహనంపై అధిరోహింపజేశారు. వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ ఉగాది ఆస్థానం నిర్వహించి, పంచాంగ శ్రవణం చేశారు. ఆలయాధికారి నాగరాజు, భక్తులు పాల్గొన్నారు.

అప్పలాయగుంటలో...

వడమాలపేట: ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం ఉగాది ఆస్థానం నిర్వహించారు. సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేపట్టారు. అనంతరం ప్రసన్న వెంకటేశ్వరస్వామి మూలవర్లు, పద్మావతీ అండాల్ సమేత ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఉత్సవర్లకు నూతన వస్త్రాలు సమర్పణ చేసి సర్వాంగ సుందరంగా సర్వాభరణాలతో అలంకరించారు. ఆలయ ప్రధాన అర్చకులు సూర్యకుమారాచార్యులు వేద మంత్రాలతో పంచాంగ శ్రవణం చేశారు. ఉభయ నాంచారులతో ప్రసన్న వెంకటేశ్వరుడిని విశేషంగా అలంకరింజేసి మాడవీధుల్లో ఊరేగించారు. భక్తులు నారికేల, కర్పూర నీరజనాలు సమర్పించి మొక్కులు తీసుకున్నారు.

కార్మిక వ్యతిరేక ప్రభుత్వాలను తరిమికొడదాం

పుత్తూరు అర్బన్, ఏప్రిల్ 9: కార్మిక వ్యతిరేక ప్రభుత్వాలను తరిమికొడదామని ప్రజావేదిక జిల్లా కార్యదర్శి కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని ద్రౌపదీదేవి ఆలయం వద్ద మినీ ట్రాన్స్‌పోర్ట్ ఓనర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ డీజల్, పెట్రోల్‌పై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విపరీతంగా పన్నులు వేసి రవాణా రంగంపై ఆధారపడిన కార్మికుల పొట్టగొడుతున్నారని మండిపడ్డారు. వెంటనే డీజల్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. సమాచార హక్కుల వేదిక కార్యదర్శి మురగారెడ్డి మాట్లాడుతూ దినసరి కూరగాయల మార్కెట్ దక్కించుకున్న కాంట్రాక్టర్లు రాజకీయ పార్టీల అండదండలతో చిరు వ్యాపారుల నుంచి అధిక మొత్తంలో వసూళ్లకు పాల్పడతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికులు ఐక్యమై వారికి అండగా నిలబడాలని పిలుపునిచ్చారు. అనంతరం కార్మికులకు యూనిఫాం పంపిణీ చేశారు. ప్రజావేదిక నేతలు మునేంద్ర, చంద్రబాబు, ఎమ్మార్పీఎస్ నాయకులు శివయ్య, మునివేలు, మినీ ట్రాన్స్‌పోర్టు యూనియన్ నాయకులు పొన్నురంగ, హరీష్, ధనపాల్, రఘుపతినాయుడు, తిరుమలయ్య, బాబు, రామ్మూర్తి, రమేష్, ఖాసీం పాల్గొన్నారు.



మినీ ట్రాన్స్‌పోర్టు యూనియన్ కార్మికుల సమావేశం

ఘనంగా ఉగాది వేడుకలు

పుత్తూరు, ఏప్రెల్ 9: పుత్తూరు పట్టణంలో క్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. స్థానిక ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పుత్తూరు వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. అలాగే ఆస్పత్రిలో వైద్యాధికారులు, సిబ్బందికి ఉగాది పచ్చడి అందించారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కేఎల్‌ఎన్ మూర్తి, మునికృష్ణయ్య, డాక్టర్స్ శ్రీనివాసులురెడ్డి, రవిరాజు, గుణశేఖర్‌రెడ్డి, మాధవనాయుడు, యుగంధర్‌రాజు, రమణ, రఘునాథ రెడ్డి, సుధాకర్‌శెట్టి పాల్గొన్నారు.



ప్రభుత్వాస్పత్రిలో రోగులకు ఉగాది పచ్చడి పంపిణీ చేస్తున్న వాకర్స్

అభివృద్ధి ప్రదాతగా 5 సార్లు శ్రీకాళహస్తి ప్రజలు ఆదరించిన నేత దివంగత మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి. ఆయన తండ్రి గంగ సుబ్బరామిరెడ్డి ఒక దఫా స్వతంత్ర అభ్యర్థిగా గెలిచి అప్పట్లో సంచలనం సృష్టించారు. సతీమణి బృందమ్మకు నాన్న అయిన తిమ్మారెడ్డి మంత్రిగా రాజకీయాల్లో రాణించారు. బొజ్జల కుటుంబం మూడవ తరం వారసుడిగా సుధీర్ రెడ్డి ఎంబీఏ పూర్తి చేసుకుని అడుగుపెట్టారు.గత ఎన్నికల్లో శ్రీకాళహస్తి టీడీపీ అభ్యర్థిగా ఎన్నికల గోదాలోకి అడుగుపెట్టారు.అయితే వైసీపీకి ఒక అవకాశం ఇవ్వాలని ప్రజలు భావించడం, ప్రత్యర్థి బియ్యపు మధుసూదన రెడ్డి అప్పటికే ఒకసారి ఓడిపోయిన సానుభూతి పనిచేయడంతో తొలిసారి ఓడిపోయారు.అయితే ఈ ఐదేళ్లుగా నియోజకవర్గంలో ప్రజల పక్షాన పోరాటాలు సాగిస్తూనే వచ్చారు. టీడీపీ అభ్యర్థిగా మరోసారి బరిలో దిగుతున్న ఆయన నియోజకవర్గ అభివృద్ధిపై తన ఆలోచనలను ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూలో పంచుకున్నారు. - శ్రీకాళహస్తి

ఇంటర్వ్యూ



నాన్నను మరిపించేలా

● బొజ్జల సుధీర్ రెడ్డి

శ్రీకాళహస్తిని అభివృద్ధి చేస్తా



కుటుంబ వారసత్వం పూర్వజన్మ సుకృతం

బొజ్జల కుటుంబ వారసత్వం పూర్వజన్మ సుకృతంతో లభించిన వరంగా భావిస్తా. శ్రీకాళహస్తి నియోజకవర్గ ప్రజలు రాజకీయంగా అత్యంత చైతన్యవంతులు. ఆదరించారంటే గుండెల్లో పెట్టుకుని పూజిస్తారు. అదేవిధంగా అభివృద్ధిని విస్మరించి స్వలాభం ఆశిస్తే మాత్రం మరో అవకాశం ఇవ్వకుండా తుడిచి పెట్టేస్తారు. బొజ్జల కుటుంబం అంటేనే కష్టానికి ప్రతీక. మా కుటుంబంలో అందరూ సొంతంగా ఎదిగిన వారే. మా తాత గంగ సుబ్బరామిరెడ్డి స్వతంత్ర అభ్యర్థిగా గెలిచి సంచలనం సృష్టించారు. ఇప్పటివరకు శ్రీకాళహస్తిలో స్వతంత్ర అభ్యర్థి గెలుపు ఆయనకు తప్ప ఎవ్వరికీ సాధ్యం కాలేదు. ఆయన తనయుడు గోపాలకృష్ణారెడ్డి తండ్రిపై ఆధారపడలేదు. మొదట శ్రీకాళహస్తీశ్వరాలయ చైర్మన్‌గా ఆయనకు అవకాశం వచ్చింది. అసలు ఎవరి ఊహకూ అందని సంస్కరణలు ఆయన తీసుకువచ్చారు. వాయు లింగేశ్వర ఆలయంలో రాహుకేతు సర్ప దోష నివారణ పూజలకు సృష్టికర్త, నామకర్తగా నిలిచారు. దాంతో వందల కోట్ల రూపాయల ఆదాయాన్ని ఆలయానికి తీసుకురాగలిగారు. ఆరుసార్లు పోటీ చేసి ఐదు సార్లు గెలుపొందిన ఎమ్మెల్యేగా,రెండు దఫాలు మంత్రిగా శ్రీకాళహస్తిలో చరిత్ర సృష్టించారు. సుదీర్ఘ రాజకీయ జీవితంలో చిన్న అవినీతి ఆరోపణకు తావు లేకుండా పనిచేశారు. అభివృద్ధికి ట్రేడ్ మార్కుగా నిలిచారు. ఆయన వారసుడిగా నేను కూడా సాంకేతికత సాయంతో అభివృద్ధిని పరుగులు పెట్టిస్తా. నాదైన ముద్రను చిరస్థాయిగా నిలుపుకోవడం కోసం అహరహం శ్రమిస్తా.

వైసీపీ అరాచకాల దుమ్ము దులుపుతాం

శ్రీకాళహస్తిలో వైసీపీ అరాచకాలతో జనం విలవిలలాడిపోయారు.ఎమ్మెల్యే మధుసూదన రెడ్డి భూకబ్జాలు, ఇసుక దోపిడీ, గ్రావెల్, దందాలు, సెటిల్మెంట్లు వంటి దుర్మార్గ చర్యలతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అందుకే ప్రజల్లో వైసీపీ అరాచకాలపై నివురుగప్పిన నిప్పులా మౌత్ టాక్ ప్రచారం జరుగుతోంది. ఎమ్మెల్యే మధు పాలనలో శ్రీకాళహస్తిని రౌడీయిజానికి మారుపేరుగా మార్చేశారు. పట్టణంలో ప్రజలు, వ్యాపారులు గుండెలు అరచేతిలో పెట్టుకుని వైసీపీ పాలన అంతం కోసం రోజులు లెక్క పెట్టుకుంటూ ఎదురుచూస్తున్నారు. ఎక్కడికి వెళ్లినా రౌడీయిజం తగ్గించాలని నాకు విజ్ఞప్తి చేస్తున్నారు.శ్రీకాళహస్తిలో గతంలో రౌడీయిజం ఉండేది. నాన్న రౌడీయిజం అనే పేరు వినబడితే ఎంతటి వారినైనా సరే ఉపేక్షించేవారు కాదు.నేను కూడా నాన్న లాగే రౌడీయిజం పట్ల వ్యవహరిస్తా.రౌడీల ఏరివేతపై ఇప్పటికే నా దగ్గర జాబితా సిద్ధంగా ఉంది. భయంతో మారిపోతారని భావిస్తున్నా. మారకుండా ప్రజలను పీడించాలని చూస్తే మాత్రం.. వారికి ప్రత్యేక ట్రీట్మెంట్ ఇచ్చేందుకు కూడా సిద్ధంగా ఉన్నా. రౌడీయిజం అన్న ఆలోచన రావాలంటేనే వణుకు పుట్టేలా చేస్తా. అలాగే ప్రభుత్వ భూముల కబ్జాదారులపై ఉక్కుపాదం మోపక తప్పదు. ప్రభుత్వ భూముల లెక్క తేల్చడానికి ఇప్పటికే ఒక నిర్దిష్టమైన ఆలోచనతో ఉన్నా. వైసీపీ గెలిచిన ఏడాదిలోనే వారి భూ దోపిడీ విధానం తెలిసిపోయింది. అప్పటి నుంచి 2019కి ముందు భూముల రికార్డులపై దృష్టి పెట్టాం. అధికారంలోకి వచ్చిన వెంటనే పాత భూముల రికార్డులు ముందు పెట్టుకుని కొత్త రికార్డులతో విచారణ చేయిస్తాం. ఐదేళ్ల కాలంలో తారుమారైన భూముల లెక్కలు సులభంగా తేలిపోతాయి. ఎమ్మెల్యే మధు 34 మంది బినామీ అధికారులతో కలిసి భూ కుంభకోణాలు నిర్వహించారు. తాజాగా ఓ తహసిల్దార్ రూ.123 కోట్ల అక్రమ ఆస్తులతో ఏసీబీకి పట్టుబడ్డాడు. అదే తరహాలో మిగిలిన అక్రమ అధికారులు కూడా ఊచలు లెక్కపెట్టే పరిస్థితి రాబోతోంది. ప్రభుత్వ భూములను తిరిగి స్వాధీనం చేసుకుని ప్రజల ముందుంచుతాం. టీడీపీలో అక్రమార్కులకు, కబ్జాదారులకు స్థానం ఉండదు.నియోజకవర్గంలో ప్రభుత్వ భూములు కబ్జా కాకుండా చర్యలు తీసుకుంటాను. కొత్త సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో ప్రభుత్వ భూముల పరిరక్షణకు ఉన్న అవకాశాలను అధ్యయనం చేశాను. ఎట్టి పరిస్థితులను అంగుళం ప్రభుత్వ భూమి కూడా అన్యాక్రాంతం కాకుండా కాపాడి భావితరాలకు అందిస్తా.

పారిశ్రామిక పరవళ్ళు

శ్రీకాళహస్తి నియోజకవర్గాన్ని చంద్రబాబు , బొజ్జల గోపాలకృష్ణారెడ్డి పారిశ్రామిక హబ్ మార్చారు. ఎన్నో భారీ పరిశ్రమలను ఇక్కడ నెలకొల్పారు. ఎమ్మెల్యేగా మధుసూదన రెడ్డి పరిశ్రమల నిర్వాహకులను దారుణంగా వేధించారు. వాటిని ఏటీఎంలుగా మార్చుకోవడంతో పారిశ్రామికవేత్తలు విసుగు చెందారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలోకి రావాల్సిన రిలయన్స్ పరిశ్రమకు పారిపోయే పరిస్థితి తీసుకొచ్చారు. టీసీఎల్ ఫేజ్-2 పరిశ్రమ మూత పడిపోయింది. ఆర్భాటంగా సీఎం జగన్ భూమి పూజ చేసిన అపాచీ పరిశ్రమ ఒక అడుగు కూడా ముందుకు పడలేదు.ఈ పరిస్థితులను పూర్తిగా మార్చాల్సి ఉంది. పరిశ్రమలను స్వాగతించేందుకు ఒక ఫ్రెండ్లీ వాతావరణం తీసుకురావాలి.అప్పుడే అభివృద్ధి, ఉపాధి, రెవెన్యూ జనరేషన్ ప్రయోజనాలు చేకూరుతాయి.శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ప్రభుత్వ భూములు కనుమరుగైపోయాయి. మళ్లీ భూములు సేకరించాలి. పారిశ్రామికవేత్తలను ఆహ్వానించాలి. పరిశ్రమల పరవళ్లతో శ్రీకాళహస్తికి పూర్వ వైభవం తీసుకురావాలి.

శ్రీకాళహస్తి అభివృద్ధిపై ప్రత్యేక విజన్

శ్రీకాళహస్తి నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేయడంపై నాకు ప్రత్యేక విజన్ ఉంది.శ్రీకాళహస్తీశ్వరాలయాన్ని ప్రత్యేకంగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది. మాస్టర్‌ప్లాన్‌ను వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. మరింత మెరుగ్గా అమలు చేయాల్సి వుంది.పట్టణంలో రోడ్లు, ఫుట్ పాత్‌లు, అలాగే సుందరీకరణ పనులు చేయాలి. పవిత్రమైన స్వర్ణముఖిని సుందరీకరించడంతో పాటు అప్‌లిఫ్టింగ్ విధానంతో నదిని ప్రక్షాళన చేయాలి. విమానాశ్రయంలో అమలు చేసే ఆటోమైజేషన్ కార్డు విధానం ముక్కంటి ఆలయంలోనూ అమలు చేయాలి. సామాన్య భక్తుల నుంచి వీవీఐపీల వరకు దళారీలను ఆశ్రయించాల్సిన అవసరం లేకుండా ఆనందకరమైన దర్శనం లభించేలా చేయాలి. ఒక్కసారి కార్డుతో ప్రవేశించిన తర్వాత కార్ పార్కింగ్ దగ్గర నుంచి... వసతి గది... ఆహారం పొందడం, సెల్ ఫోన్, లగేజీ లాకర్... దర్శనం టైం స్లాట్, అలాగే ప్రసాదాలు అందుకోవడం తిరిగి మళ్లీ బయలుదేరేవరకు ఈ ఆటోమైజేషన్ కార్డు ద్వారా భక్తులు అన్ని సేవలు సులభంగా అందుకోవచ్చు. పవిత్ర పుణ్యక్షేత్రమైన శ్రీకాళహస్తిలో ప్లాస్టిక్ కనిపిస్తే కఠిన చర్యలు తీసుకోక తప్పదు. ఈ విషయంలో జేసీ ప్రభాకర రెడ్డి నాకు ఆదర్శం. నేను, నా సతీమణి రిషితా రెడ్డి ప్రతి గడపకూ వెళ్లి పలకరించాము. నిరుపేదల దుర్భర పరిస్థితులు బాధ కలిగించాయి. నియోజకవర్గంలో ఇంకా 53 వేల ఇళ్ళు పేదలకు నిర్మించి ఇవ్వాల్సిన అవసరం వుందని గుర్తించాను.దశలవారీగా పేదలపై ఎలాంటి భారం లేకుండా పూర్తిగా ప్రభుత్వ నిధులతో ఇండ్లు నిర్మించి అందజేయాలని సంకల్పించాను.

ఏరియా ఆస్పత్రికి మహర్దశ కల్గించాలి

శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి మహర్దశ తీసుకురావాలన్నది మా అమ్మ బృందమ్మ కల.100 పడకల ఆసుపత్రిని మా నాన్న బొజ్జల గోపాలకృష్ణారెడ్డి ఏర్పాటు చేశారు. గత టీడీపీ పాలనలో అమ్మ ఉచిత డయాలసిస్ కేంద్రం కోసం ఎంతో కృషి చేశారు.అలాగే డిజిటల్ ఎక్స్‌రే సిస్టం, సెంట్రల్ ఆక్సిజన్, అరుదైన శస్త్ర చికిత్సలు, మెడాల్ ద్వారా ఉచితంగా ఖరీదైన వ్యాధి నిర్ధారణ పరీక్షలు, నిరంతరం వైద్యులు అందుబాటులో ఉండడం, అంబులెన్స్ సౌకర్యం వంటివి తీసుకొచ్చారు. ఈరోజు ఆస్పత్రి పరిస్థితి చూస్తుంటే చాలా బాధేస్తుంది. ఎక్కడ చూసినా వీధి కుక్కలు, పందులు సంచరించే దుస్థితి నెలకొంది. రాత్రి అయితే వైద్యులు కూడా అందుబాటులో ఉండడం లేదు. ఇలాంటి పరిస్థితి మొత్తం మార్చాల్సి ఉంది.ఏరియా ఆసుపత్రిని జిల్లా వైద్యశాలగా మార్చే అవకాశాన్ని పరిశీలిస్తాం. లేకపోతే 200 పడకల సామర్థ్యానికి పెంచుతాం. ముక్కంటి ఆలయంతో ఆస్పత్రిని అనుసంధానం చేసి నాణ్యమైన వైద్య సేవలు అందించే ఆలోచన ఉంది.

స్కిట్ కు పూర్వ వైభవం

ఇంజనీరింగ్ విద్య సామాన్యులకు అందని రోజుల్లో ఐటీ శాఖ మంత్రిగా మా నాన్న సాంకేతిక విద్యపై దృష్టి సారించారు. శ్రీకాళహస్తి వంటి చిన్న పట్టణంలో విద్యావంతులు పెరిగి భావితరాలు బాగుపడాలని ఎన్నో సాంకేతిక సమస్యలను అధిగమించి స్కిట్ ఇంజనీరింగ్ కళాశాలకు బీజం వేశారు. ముక్కంటి ఆలయంతో అనుబంధంగా ఎట్టకేలకు స్కిట్ ఇంజనీరింగ్ కళాశాలను ఏర్పాటు చేయించారు. స్కిట్ ఇంజనీరింగ్ కళాశాల ఒకప్పుడు రాష్ట్రంలోనే ఒక బ్రాండ్‌గా నిలిచింది. ఉమ్మడి రాష్ట్రంలో ఎక్కడెక్కడి నుంచో విద్యార్థులు వచ్చి ఇక్కడ ఇంజనీరింగ్ విద్యను అభ్యసించారు. వేలమంది పిల్లలు స్కిట్ విద్యాధామంలో చదువుకుని ఇతర దేశాల్లో స్థిరపడి శ్రీకాళహస్తికి గర్వకారణంగా నిలిచారు. అంతటి మహోన్నత విద్యా వ్యవస్థను వైసీపీ ఎమ్మెల్యే మధు కాలగర్భంలో కలిపేశారు. స్కిట్ కళాశాల బిడ్డల భవిష్యత్తుకు చాలా అవసరం. ఆ విషయంలో మాత్రం అసలు ఆలోచించే ప్రసక్తే లేదు. స్కిట్ కళాశాలను నేను గెలిచిన వెంటనే ముక్కంటి ఆలయానికి అనుబంధంగా పునఃప్రారంభిస్తాను. వందలాదిమంది విద్యార్థులతో కళాశాల కళకళలాడేలా పూర్వ వైభవం తీసుకొస్తాను.

సాగునీటితో రైతులను ఆదుకుంటా

రైతులను ఆదుకునేందుకు సాగునీటి విడుదలపై ప్రత్యేక శ్రద్ధ చూపాల్సి ఉంది. ఇటీవల వర్షాలతో నీరు పుష్కలంగా వచ్చాయి కానీ పాలకులు తమ చేతకానితనంతో నిరుపయోగం చేశారు. ఐదేళ్ల నుంచి ఒకచోట కూడా పూడిక తీసిన పాపాన పోలేదు. అన్ని చెరువుల్లో పూడిక తీసి నీటి నిల్వలను పెంచుకోవాలి. అలాగే కాలువలు, వాగులు, వంకలు పూర్తిగా శుభ్రం చేసి సాగు నీటిపారుదలకు మార్గం సుగమం చేసుకోవాలి. ఇక గ్రామాల్లో చెరువుల ద్వారా స్థానికులకు చేపలు పెంచుకునే అవకాశం కల్పించడం ద్వారా ఉపాధి పెరుగుతుంది.

ఆనందమయంగా కొత్త కాపురం

మూడు పార్టీల కూటమి కొత్త కాపురం లాంటిది. శ్రీకాళహస్తిలో కూటమి పార్టీలు బాగా సహకరిస్తున్నాయి. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ నాకు బాగా సహాయంగా నిలుస్తున్నారు. ఆయన బీజేపీ, టీడీపీ ఆత్మీయ సమావేశం కూడా ఏర్పాటు చేశారు. ఇక జనసేన వాళ్లు ఇంకా బాగా కలుసుకోవాల్సిన అవసరం ఉంది. మొత్తంగా కొత్త కాపురం కాబట్టి మెల్లమెల్లగా ముందుకు అడుగులు పడుతున్నాయి.

కన్నప్ప ఆలయంలో పూజలు



భక్తులకు అన్నదానం చేస్తున్న రిషితా రెడ్డి

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 9: శ్రీకాళహస్తి పట్టణం తేరు వీధిలో వెలసిన భక్త కన్నప్ప ఆలయాన్ని ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్ రెడ్డి సతీమణి రిషితారెడ్డి దర్శించుకున్నారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం ఆమె భక్తకన్నప్ప ఆలయంలో పూజలు అనంతరం కమిటీ సభ్యులు నిర్వహించిన అన్నదానం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు వంకాయల సిద్దులయ్య తదితరులు పాల్గొన్నారు.

దక్షిణ కాళికాదేవికి ప్రత్యేక పూజలు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 9: శ్రీకాళహస్తి మండలం వేడాం గ్రామంలో వెలసిన దక్షిణ కాళికాదేవికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.మధ్యాహ్నం రాహుకాలం సమయంలో అర్చకులు అమ్మవారి మూలమూర్తిని అభిషేకింకించి అలంకరించి భక్తులకు దర్శనం కలిగించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

కేవీబీపురం, ఏప్రిల్ 9: మండలంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తీసుకుంటామని సీఐ భాస్కర్‌నాయక్ హెచ్చరించారు. మంగళవారం ఆయన కేవీబీపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం రాత్రి నుంచి మంగళవారం వరకు పెరిందేశం గ్రామస్థులు, కేవీబీపురం గ్రామస్థుల మధ్య జరిగిన గొడవలను పురస్కరించుకుని ఇరువర్గాలను పిలిపించి సమన్వయపరిచారు. అల్లర్లకు కారణమైన వారిపై కేసులు నమోదు చేశామని చెప్పారు. ప్రజలు ఎన్నికల సమయంలో శాంతిభద్రతలను పాటించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ నజీరుద్దీన్, పిచ్చాటూరు ఎస్ఐ వెంకటేశ్వర్లు, నారాయణవనం ఎస్ఐ లక్ష్మీనారాయణ, ఏఎస్ఐ లోకనాథం తదితరులు పాల్గొన్నారు.



ప్రజలతో మాట్లాడుతున్న సీఐ భాస్కర్ నాయక్

టీడీపీలోకి వలసలతో వైసీపీ ఖాళీ : సుధీర్



పార్టీలో చేరిన వారితో బొజ్జల సుధీర్‌రెడ్డి - సుధీర్‌ను సన్మానిస్తున్న జనసేన నాయకులు

శ్రీకాళహస్తి/తొట్టంబేడు, ఏప్రిల్ 9: వైసీపీ నుంచి టీడీపీలోకి వలసల జోరు రోజురోజుకు పెరుగుతోందని బొజ్జల సుధీర్‌రెడ్డి అన్నారు. శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన వ్యాపారవేత్త, వైసీపీ నాయకులు చిట్టేటి చిన్ని సుధీర్ రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. అదేవిధంగా శ్రీకాళహస్తి మండలంలోని ఊరందూరులో సుధీర్‌రెడ్డి నివాసంలో మంగళవారం సుధీర్‌రెడ్డిని కలిసిన రాంబట్లపల్లి గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు మణికంఠ, శ్రీనివాసులు, పోలయ్య, జనార్ధన్, పెంచలయ్య, గంగరాజు, నరేష్, వెంకటేష్, సుబ్రమణ్యం వారి మిత్రబృందం సుమారు 30మంది టీడీ పీలో చేరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వెంకటాచలం, మురళినాయుడు, మునిరాజనాయుడు తదితరులు పాల్గొన్నారు.

జనసేన నాయకుల ఉగాది శుభాకాంక్షలు

ఏర్పేడు: శ్రీకాళహస్తి నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డిని మంగళవారం ఏర్పేడు మండల జనసేన నాయకులు ఊరందూరులోని ఆయన స్వగృహంలో కలిసి ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమలో జనసేన మండలాధ్యక్షుడు కిరణ్ రామిశెట్టి, డివిజన్ అధ్యక్షుడు వంశీకృష్ణ, నాయకులు సురేంద్ర, జనార్ధన్, పవన్‌కుమార్, శివశంకర్, చలపతి, గౌతమ్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే ఎస్సీల ఆత్మగౌరవం



మాట్లాడుతున్న బొజ్జల బృందమ్మ

తొట్టంబేడు, ఏప్రిల్ 9: ఎస్సీల ఆత్మగౌరవం టీడీపీతోనే సాధ్యమని బొజ్జల బృందమ్మ అన్నారు. మండలంలోని కంచనపల్లి గ్రామంలో మండలంలోని ఎస్సీలతో మంగళవారం ఆమె ఆత్మీయసమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాలి చలపతినాయుడు, మండల అధ్యక్షుడు మురళినాయుడు, మాజీ జడ్పీటీసీ వెంకటాచలం, మండల టీడీపీ ఎస్సీసెల్ అధ్యక్షుడు సునీల్‌కుమార్, జయచంద్రనాయుడు, వెంకటసుబ్బయ్య, రమేష్, మోహన్, చంద్రారెడ్డి, వీరాస్వామి, గురవయ్య, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

జయహో బీసీ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిమూలం

బీసీలకు టీడీపీ ప్రభుత్వమే న్యాయంచేస్తుంది



జయహో బీసీ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిమూలం

కేవీబీపురం, ఏప్రిల్ 9: బీసీలకు న్యాయం జరగాలంటే తెలుగుదేశం ప్రభుత్వమే అధికారంలోకి రావాలని ఎమ్మెల్యే ఆదిమూలం చెప్పారు. మంగళవారం మండలంలోని అంజూరు గ్రామంలో జయహో బీసీ సభ కార్యక్రమంలో ఉమ్మడి బీజేపీ, జనసేన అభ్యర్థులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో బీసీలు,దళితులు అందరూ బాగుపడాలంటే టీడీపీ ప్రభుత్వాన్ని గెలిపించి చంద్రబాబును ముఖ్యమంత్రినిచేయాలని కోరారు. టీడీపీ మండలాధ్యక్షుడు రామాంజుల నాయుడు, తిరుపతి పార్లమెంటు తెలుగు రైతు అధ్యక్షుడు గోపీనాథరెడ్డి, మల్లికార్జునరెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు మునిశేఖర్‌యాదవ్, జనసేన నాయకుడు మోహన్, ముకేష్‌రెడ్డి, మహిళా అధ్యక్షురాలు పార్వతి తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పిచ్చికుక్క బారినుంచి రక్షించండి

రేణిగుంట, ఏప్రిల్ 9: స్థానిక బుగ్గవీధిలో పిచ్చికుక్క బారి నుంచి రక్షించాలని స్థానికులు అధికారులకు మొరపెట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే బుగ్గవీధిలో కాపురం ఉంటున్న వృద్ధురాలు సైదాన్‌బీ పిచ్చికుక్క దాడిలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఇటీవల మృతి చెందింది. అదే రోజు పిచ్చికుక్క ఏడుగురిని కరిచింది. దీంతో ఆ ప్రాంతంలో ప్రజలు ఆందోళన చెందుతున్నాను. ఆదివారం కూడా పక్క వీధిలో నలుగురిని కరిచింది. ఈ విషయమై స్థానికప్రజలు సచివాలయంలో ఫిర్యాదు చేసి పిచ్చికుక్క బారినుంచి రక్షణ కల్పించాలని కోరారు.

రసరమ్యం కవి సమ్మేళనం



లగడపాటి భాస్కర్ సాహితీ పురస్కారం అందుకుంటున్న కవులు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 9: తెలుగు సంవత్సరాదిని పురస్కరించుకుని కవి సమ్మేళనం రసరమ్యంగా జరిగింది. శ్రీకాళహస్తి పట్టణంలోని కల్యాణ మండపంలో మంగళవారం ఉగాది పండుగను పురస్కరించుకుని కవి సమ్మేళనం నిర్వహించారు. హాజరైన కవులు,రచయితలు వారి స్వీయ కవితలను వినిపించారు. అనంతరం ప్రముఖ కవి లగడపాటి భాస్కర్ పేరుమీద ఆయన కుమార్తెలు కిరణ్మయి, శశి సాహితీ పురస్కారాలు అందజేశారు. ఇందులో భాగంగా శతాబ్దావధాని ఆముదాల మురళి, రచయిత చెంచు కృష్ణకు పురస్కారాలతో పాటు రూ.5000 నగదు ప్రోత్సాహం అందజేసి జ్ఞాపికతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కవులు గొడుగు చింత గోవిందయ్య, యువశ్రీ మురళి, జయచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా నల్లగంగమ్మ ఊరేగింపు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 9: శ్రీకాళహస్తి పట్టణంలోని బహదూర్ పేటలో మంగళవారం ఉగాది పర్వదినం పురస్కరించుకుని నల్ల గంగమ్మ ఉత్సవమూర్తి ఊరేగింపు వేడుకగా జరిగింది. ప్రతి సంవత్సరం ఉగాది పర్వదినం రోజున అమ్మవారి ఉత్సవమూర్తి నగర ఉత్సవం జరగడం ఆనవాయితీ. ఏడాది మండల చైర్మన్ కంఠా రమేష్ ఆధ్వర్యంలో దాతల సహాయంతో అమ్మవారికి కొత్తగా వెండి ఆభరణాలను తయారు చేశారు. విశేష అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం ఆలయం నుంచి ఊరేగింపు ప్రారంభించారు. భక్తులు పసుపు నీటితో స్వాగతం పలికి కర్పూర హారతులు సమర్పించారు.



వెండి కవచాల అలంకారంలో నల్ల గంగమ్మ



అమ్మవారి ఊరేగింపు